
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
మంగళవారం 29 ఏప్రిల్ 2025



ఎంపీడీవోలకు స్థానాలు కేటాయింపు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉమ్మడి జిల్లా డిప్యూటీ ఎంపీడీవో పరిపాలనాధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఎంపీడీవోలను కేటాయిస్తూ జడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనాధికారి డ్వామా టీవీ రమణారావు ను దేవనకొండ ఎంపీడీవోగా, జూపాడుబంగ్లా ఏవో బి.నూర్జహాన్‌ను మంత్రాలయం ఎంపీడీవోగా, ఆదోని పరిపాలనా అధికారి కే.విజయశేఖర్‌రావు కౌతాళం ఎంపీడీవోగా, డిప్యూటీ ఎంపీడీవో జి.ప్రభావతిదేవిని పెద్దకడుబూరు ఎంపీడీవోగా, మద్దికెర డిప్యూటీ ఎంపీడీవో ఏ.మద్దిలేటి స్వామిని ఆలూరు ఎంపీడీవోగా నియమించారు.



కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ సెంటర్‌లో వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు

వక్ఫ్ చట్ట సవరణను
వెనక్కి తీసుకోవాలి

- ముస్లిం పర్సనల్ లా బోర్డు, జేఏసీ భారీ ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదం తెలిపిన వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణ వెనక్కి తీసుకోవాలని కోరుతూ సోమవారం ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ చేపట్టారు. వేలాదిగా ముస్లింలు తరలిరావడంతో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ముందుగానే ఆర్టీసీ బస్సులను బళ్లారి చౌరస్తామీదుగా తరలించారు. అయితే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ జాకీర్ మౌలానా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు భూములను కట్టబెట్టడానికే వక్ఫ్ చట్టంలో సవరణలు చేసిందరన్నారు. చట్ట సవరణ ద్వారా వక్ఫ్ బోర్డు ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. తక్షణమే వక్ఫ్ చట్ట సవరణ చట్టాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో కన్వీనర్లు ఎంఏ.హమీద్, పి.ఇక్బాల్ హుస్సేన్, మజీద్ మౌలానా, డి.గౌస్‌దేశాయ్, నూరుల్లా ఖాద్రి, ఆవాజ్ కార్యదర్శి ఎంఏ చిస్తి, జమాతే ఇస్లామి ఏ హింద్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ ఖాదిర్, కేదార్‌నాథ్, కిరణ్,జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. ముస్లింల ర్యాలీకి వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, వైసీపీ నాయకుడు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు మద్దతుపలికారు. ర్యాలీలో పాల్గొన్న ముస్లింలకు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు అబ్దుల్లా, రాఘవేంద్ర, నగేష్ హుస్సేన్ బాషా, అంజి తదితరులు తాగునీటి వసతిని కల్పించారు.



వక్ఫ్ చట్టసవరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ


తుంగభద్ర డ్యాం గేట్లపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా



ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డితో సమావేశమైన రిటైర్డు ఈఎన్‌సీ, టీబీపీ బోర్డు ఎస్ఈ నారాయణ్ నాయక్

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం గేట్లు నిర్వహణలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని రాబోయే సీజన్‌కు ఎలాంటి సమస్య రాకుండా బోర్డు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలంటూ కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. సోమవారం తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు ఎస్ఈ నారాయణ నాయక్, కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి కలెక్టర్‌తో సమావేశమయ్యారు. గత ఏడాది ఆగస్టులో తుంగభద్ర డ్యాం 19వ నెంబరు గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. టీబీపీ ఎల్లెల్సీ కింద కర్నూలు జిల్లాలో 1.51 లక్షల ఆయకట్టుకు సాగునీరు, 196 గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉంది. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండటంతో డ్యాంగేట్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలంటూ ఇంజనీర్లకు కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా టీబీపీ బోర్డు ఎస్ఈ నారాయణ్ నాయక్ డ్యాం భద్రతపై కలెక్టర్‌కు వివరించారు. 19వ నెంబరు గేటు రూ.1.98 కోట్లతో టెండర్లను పూర్తి చేశామని, జూన్ ఆఖరులోగా కొత్త గేటు అమరుస్తామని తెలిపారు. మరో 32 గేట్లకు టెండర్లు పిలుస్తున్నట్లు వివరించారు. అలాగే కాల్వల నిర్వహణపై తీసుకుంటున్న జాగ్రత్తలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు రిటైర్డు ఈఎన్‌సీ జలంధర్, రిటైర్డు ఎస్ఈ విశ్వనాథ్ తదితరులు ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డితో సమావేశమయ్యారు. పశ్చిమ ప్రాంతం తాగునీటి వనరుల అభివృద్ధి, గుండ్రేవుల ప్రాజెక్టు సాధన తదితర అంశాలపై చర్చించారు.



శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం డ్యాం భద్రతపై తక్షణ చర్యలు

- అవసరమైన యాక్షన్ ప్లాన్ తయారు చేయండి
- డ్యాం అధికారులను ఆదేశించిన ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్
- విజయవాడలో సమీక్షించిన నేషనల్ డ్యాం సేఫ్టీ బృందం

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ సూచించారు. అవసరమైన యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రాజెక్టు ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం విజయవాడలో శ్రీశైలం సహా వివిధ ప్రాజెక్టులపై అనిల్ జైన్ సమీక్ష నిర్వహించారు. శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ప్రాజెక్టుకు తీసుకోవాల్సిన భద్రత చర్యలు వివిధ ప్రతిపాదనలపై ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్‌కు వివరించారు. అదే క్రమంలో డ్యాం తక్షణ మరమ్మతులకు రూ.30-35 కోట్లు అవసరం ఉందని శ్రీరామచంద్రమూర్తి వివరించారు. తక్షణమే ఆసరమైన నిధులు ఇవ్వాలంటూ ఆర్థిక శాఖకు అనిల్ జైన్ సూచించినట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం ప్రాజెక్టు 2009 వరదలకు భారీగా దెబ్బతిందని, భద్రత ప్రశ్నార్థకంగా ఉందంటూ ఇప్పటికే పలు నిపుణుల కమిటీలు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. డ్యాం స్పిల్‌వేలో 490 అడుగుల్లో ఉన్న గ్యాలరీలు కనిష్ట నీటి మట్టంలో 220 గ్యాలరీలలో లీకేజీ ఏర్పడుతుందని, పలు మరమ్మతులు చేపట్టాలని వీటిని మే 31లోగా పూర్తి చేయాలని గతంలోనే ఆదేశించినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

నేడు డ్యాంను పరిశీలించనున్న అనిల్ జైన్

నేషనల్ డ్యాం సేఫ్టీ చైర్మన్ అనిల్ జైన్ మంగళవారం (నేడు) శ్రీశైలం డ్యాంను పరిశీలించనున్నారు. విజయవాడలో జరిగిన ప్రాజెక్టుల సమీక్ష అనంతరం ఆయన శ్రీశైలానికి బయలుదేరినట్లు తెలిసింది. ఆయనతో పాటు సీడబ్ల్యూసీ, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణుల బృందం కూడా శ్రీశైలం డ్యాం పరిశీలించే అవకాశం ఉందని ఇంజనీర్లు పేర్కొన్నారు.

కలపరిలో జ్వరాల కలకలం

నేడు కలపరిలో పర్యటిస్తున్న స్టేట్ వైద్యాధికారులు

7

కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా విష్ణువర్ధన్ రెడ్డి

- డీసీఎంఎస్ చైర్మన్‌గా వై. నాగేశ్వరరావు యాదవ్
- నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసిన సీఎం చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా సహకార బ్యాంకులు, సహకార మార్కెటింగ్ సొసైటీల నామినేటెడ్ పదవులను సీఎం చంద్రబాబు భర్తీ చేశారు. అందులో భాగంగానే సోమవారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో జిల్లాకు సముచిత స్థానం దక్కింది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార బ్యాంకు (కేడీసీసీబీ) చైర్మన్‌గా ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డిని ఎంపిక చేశారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా వైజీ నాగేశ్వరరావు యాదవ్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. జిల్లాలో టీడీపీ అభివృద్ధికి, ఎన్నికల్లో అభ్యర్థులను గెలుపునకు కృషి చేస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల ఎంపికలో ప్రాధాన్యం ఇచ్చారు.



కేడీసీసీ చైర్మన్‌గా విష్ణువర్ధన్ రెడ్డి

కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా కోడుమూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి, ఆ పార్టీ సీనియర్ నాయకులు డి. విష్ణువర్ధన్ రెడ్డిని సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎంపిక చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీ బలోపేతం కోసం విష్ణు వర్ధన్‌రెడ్డి ఎంతో కష్టపడ్డాడు. ఉమ్మడి రాష్ట్రంలో అలంపూరు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కర్నూలు ఎంపీపీగా పని చేశారు. రాష్ట్ర విభజన తర్వాత కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ ఆ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం శ్రమించారు. బలమైన అనుచరగణం కలిగిన విష్ణు సూచనల మేరకు గత ఎన్నికల్లో కోడుమూరు ఎమ్మెల్యే టికెట్ ఆయన సన్నిహితుడైన బొగ్గుల దస్తగిరికి చంద్రబాబు ఇచ్చారు. ఎంపీ టికెట్ పంచలింగాలకు చెందిన బస్తిపాటి నాగరాజుకు ఇచ్చారు. వీరిద్దరు కూడా భారీ మెజారిటీతో విజయం సాధించి చట్టసభలో అడుగు పెట్టారు. వైసీపీ హయాంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నా కర్నూలు, గూడూరు, బెళగల్ మండలాల్లో పలు గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీలను గెలిపించుకుని సత్తా చాటారు. ఆయన ప్రతిభను గుర్తించిన చంద్రబాబు కేడీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చారు.



నాగేశ్వరరావు యాదవ్‌కు డీసీఎంఎస్..

టీడీపీ అధినేత చంద్రబాబు, యువ నేత నారా లోకేశ్‌కు నమ్మకంగా ఉన్న ప్యాపిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు వై.జి. నాగేశ్వరరావు యాదవ్‌కు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ పదవి ఇచ్చారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన కుటుంబం ఆ పార్టీలో కొనసాగుతూ వచ్చింది. నాగేశ్వరరావు యాదవ్ తండ్రి కుళ్లాయప్ప 1983 నుంచి చంద్రపల్లి సర్పంచ్‌గా విజయం సాధిస్తూ వచ్చారు. 1992లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నాగేశ్వరరావు యాదవ్ 1995లో ప్యాపిలి జడ్పీటీసీగా విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో రెండో పర్యాయం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా పని చేశారు. టీడీపీ బీసీ సాధికార విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా, ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల ఫెడరేషన్ చైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన విశ్వసనీయతను గుర్తించిన చంద్రబాబు డీసీఎంఎస్ చైర్మన్ నామినేటెడ్ పదవి ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, యువనేత నారా లోకేశ్, ఉమ్మడి జిల్లా మంత్రులు, ముఖ్య నాయకులు తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చారని అన్నారు.



వేధిస్తున్న హెడ్ కానిస్టేబుల్

- కలెక్టర్‌ను ఆశ్రయించిన శ్రీరామ రెసిడెన్సీ కాలనీ వాసులు
- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ ఆగడాలు, వేధింపులు తట్టుకోలేకపోయిన ఓ కాలనీ వాసులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అడ్డాకుల విద్యాసాగర్ నిత్యం మద్యం సేవించి కాలనీ ప్రజలను నీచంగా చూడటంతో పాటు మహిళల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నాడంటూ కర్నూలు నగరంలోని శ్రీరామ రెసిడెన్సీకాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ రెసిడెన్సి కాలనీవాసులు మాట్లాడుతూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అడ్డాకుల విద్యాసాగర్ ప్రతిరోజు మద్యం సేవించి మహిళలను అసభ్యపదజాలాలతో దూషిస్తూ అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. 'మాది ధర్మపేట.. మా అన్న రౌడీషీటర్, ఎవరైనా మాకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారిని చంపేస్తాం..' అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు హెడ్ కానిస్టేబుల్‌పై ఎస్పీతో పాటు నాగలాపురం ఎస్ఐకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఆయనపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ ప్రజలు

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ఆడిట్ చేయాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

పీజీఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కారంపై జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందని, ఇందుకు సంబంధించి పోలీసు శాఖలో 1400, డీఆర్వో వద్ద 1100, ఏడీ సర్వేయర్ వద్ద 540, డ్వామా పీడీ వద్ద 50, హౌసింగ్ పీడీ వద్ద 67, వ్యవసాయ శాఖ వద్ద 79, డీఎంహెచ్‌వో వద్ద 97 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో గోనెగండ్ల, మద్దికెర, హాలహర్వి, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదోని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా ముల్లా గౌస్

ఆదోని టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : గత రెండు వారాలుగా తీవ్ర ఉత్కంఠత రేకెత్తించిన మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ముగిసింది. వైస్ చైర్మన్ ముల్లా గౌస్‌ను మున్సిపల్ శాఖ ఇన్‌చార్జిగా నియమించింది. ఈనెల 16వ తేదిన చైర్పర్సన్ వాల్మీకి బోయ శాంతపై సొంత పార్టీ వైసీపీ వారే అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడంతో చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాల్సి వచ్చింది. అవిశ్వాస తీర్మానం అనంతరం చైర్మన్ ఎన్నికపై పట్టణంలో తీవ్ర చర్చ జరిగింది. ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ను నియమిస్తారా లేక చైర్మన్‌ను ఎన్నుకుంటారా? అనేది చర్చనీయాంశమైంది. సోమవారం మున్సిపల్ శాఖ నుండి వైస్ చైర్మన్ నుండి ముల్లా గౌస్‌ను ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా ఎంపిక చేస్తున్నట్లు ఉత్తర్వులు అందాయి.





ఆదివారం అర్ధరాత్రి రోవర్‌తో హత్యా స్థలాన్ని నిర్ధారిస్తున్న రెవెన్యూ శాఖ సర్వే అధికారులు

అర్ధరాత్రి హైడ్రామా

- చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ప్రదేశంలో సర్వే
- ఆర్డీఓల సమక్షంలో అనంతపురం, కర్నూలు జిల్లా సరిహద్దుల కొలత
- కర్నూలు జిల్లా పరిధిగా నిర్ధారణ
- కేసు గుంతకల్లు స్టేషన్ నుంచి చిప్పగిరికి మార్పు

గుంతకల్లు/ఆలూరు/చిప్పగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో హైడ్రామా సాగింది. హత్య జరిగిన ప్రదేశం అనంతపురం జిల్లా గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిగా భావించి ఇక్కడి పోలీసులు కేసుపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆ ప్రదేశం విషయంగా సందేహాలు ఉండటంతో ఆదివారం రాత్రి సర్వే చేపట్టారు. అర్ధరాత్రిదాకా గుంతకల్లు, పత్తికొండ రెవెన్యూ డివిజనల్ అధికారులు, కర్నూలు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సర్వే, రెండు జిల్లాల సర్వే అధికారులు, తహసీల్దార్లు, గుంతకల్లు డీఎస్పీ, సీఐలు సర్వేలో పాల్గొన్నారు. రోవర్ ద్వారా మ్యాప్ సర్వే చేపట్టి ఆ ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందని అర్ధరాత్రి 2 గంటలకు తేల్చారు. ఈ మేరకు అధికారికంగా రిపోర్టును విడుదల చేశారు.

మిగతా 7వ పేజీలో

లీప్.. రిలీఫ్..!



- ఇకపై అన్నీ ఒకే యాప్ ద్వారా నమోదు
- అమలులోకి తెచ్చిన విద్యాశాఖ
- ఉపాధ్యాయులపై తగ్గిన భారం

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, విద్యార్థులకు కిట్లు పంపిణీ ఇలా ఒక్కొక్క దానికి ఒక్కో యాప్ ఉండేది. వాటి పాస్‌వర్డులను గుర్తించుకుని లాగిన్ కావడం ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా ఉంటుంది. అంతేగాక ఉపాధ్యాయుల వివరాలను సీఎస్‌సీ ద్వారా నమోదు చేయాల్సి వచ్చేది. విద్యాసంవత్సరంలో సుమారు 30కి పైగా యాప్‌లను వినియోగించాల్సి వచ్చేది. యాప్‌ల భారం తగ్గించండి మహాప్రభో అంటూ ఉపాధ్యాయులు మొత్తుకున్నా.. అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారు. గత వారం నుంచి ప్రభుత్వం 'లీప్' (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) పేరుతో సమగ్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. గత ఐదేళ్ల పాటు ఉద్యోగులు, విద్యార్థుల హాజరుకు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, మనబడి నాడు-నేడు, పీఎంశ్రీ, పాఠ్యపుస్తకాల పంపిణీ ఇలా తదితర వివరాలు నమోదు చేసేందుకు వేర్వేరు యాప్‌లు ఉండేవి. వీటన్నింటిలో వివరాలు నమోదు చేయడం, వాటి ఐడీలు, పాస్‌వర్డ్‌లు గుర్తుపెట్టుకోలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. కానీ ప్రస్తుతం వివిధ రకాల యాప్‌లను తొలగించి వాటన్నింటి స్థానంలో ఒకే ఒక 'లీప్' యాప్‌ను తెచ్చి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఊరటనిచ్చింది.

డ్యాష్ బోర్డు విభాగంలో...

విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎండీఎం తీసుకున్న వారి సంఖ్య అసెస్‌మెంట్, అపార్ స్థితి, ఆధార్ నమోదు, విద్యార్థుల బదిలీలు, విద్యాకమిటీ, తల్లిదండ్రుల కమిటీల సమావేశాల సంఖ్య శాతం తదితర అంశాలను పొందుపరిచారు.

విద్యార్థి విభాగంలో..

విద్యార్థి అపార్ నెంబరుతో లాగిన్ అయి ఆ విద్యార్థికి సంబంధించిన అన్ని అంశాలను దాని ద్వారా తెలుసుకునేలా లీప్ యాప్‌ను రూపొందించారు. మరికొన్ని విభాగాలకు సంబంధించిన సమాచారం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు డిస్‌ప్లే అవుతుంది. ఉపాధ్యాయుల ప్లేస్లిప్, మెడికల్ బిల్లుల స్థితి తదితర అంశాలు దీనిలో ఉన్నాయి. మొత్తానికి అనేక యాప్‌ల గోల లేకుండా ఒకే యాప్ ద్వారా పాఠశాలలకు చెందిన అన్ని అంశాలు నమోదు చేసే అవకాశం కల్పించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● లీప్ యాప్‌లోని అంశాలివే...

గతంలో ఉన్న సిమ్స్ యాప్ పాస్‌వర్డ్, యూజర్ నేమ్ ఉపయోగించి లీప్ యాప్‌తో లాగిన్ అవ్వొచ్చు. లాగిన్ అయ్యాక స్టూడెంట్, డిపార్టుమెంటు అనే రెండు విభాగాలు కనిపిస్తాయి. దీనిలో డిపార్టుమెంటుపై క్లిక్ చేస్తే ఆరు అంశాలు కనిపిస్తాయి. స్కూల్, టీచర్, కమ్యూనికేషన్, స్టూడెంట్, గవర్నెన్స్, డ్యాష్‌బోర్డు డిస్‌ప్లే అవుతాయి. వీటిలో టీచర్‌పై క్లిక్ చేస్తే టీచర్ ప్రొఫైల్ ఓవర్ వ్యూ టీచర్ లీడర్‌షిప్ అండ్ ట్రైనింగ్, టీచర్ సర్వీసెస్, టీచర్ రీసోర్సెస్ అనే అంశాలు కనిపిస్తాయి. టీచర్ సర్వీసెస్‌లో అటెండెన్స్ అనే టెయిల్ ద్వారా హాజరు వేయవచ్చు. ఇదేటెయిల్‌లో లీప్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పొందుపరిచారు.



గవర్నెన్స్ విభాగంలో...

సీఎస్‌సీ, సమగ్ర శిక్ష, మిడ్ డే మీల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు. గతంలో ఉన్న ఐఎంఎంఎస్ యాప్ మిడ్‌డే మీల్ విభాగంలో ఓపెన్ అయి మధ్యాహ్న భోజన పథకం ఫొటోలు అప్‌లోడు చేసే వీలు కల్పించారు. ఇందులోనే బాత్‌రూమ్‌ల తనిఖీని నమోదు చేసే టీఎంఎఫ్‌ను కూడా జత చేశారు. సమగ్ర శిక్ష విభాగంలో పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర, కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లను పొందుపరిచారు.

సీఎస్‌సీ విభాగంలో...

హెచ్‌ఎం అప్రూవల్, టీచర్ ఇన్‌ఫర్మేషన్ అంశాలు ఉన్నాయి. దీనిద్వారా నేరుగా ఉపాధ్యాయులు తమ సమాచారాన్ని సీఎస్‌సీ సైట్‌లోకి వెళ్లకుండానే నమోదు చేసే వీలుంది. స్టూడెంట్ విభాగంలో విద్యార్థి ప్రొఫైల్ ఓవర్ వ్యూ పెర్ఫార్మెన్స్ ఎన్ టైటిల్‌మెంటు యాక్సెస్ అనే విభాగాల ద్వారా విద్యార్థులకు సంబంధించిన అంశాలను నమోదు చేసే వీలు కల్పించారు.

కళాకారుల కోసమే అరుణభారతి

వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి



బనగానపల్లె, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కళాకారుల సంక్షేమం, వారిలోని కళా నైపుణ్యాన్ని మరింత విస్తృతం చేయడం లక్ష్యంగా అరుణభారతి సాహితీ సంస్థను ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం బనగానపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మే రెండోతేదీన శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అరుణభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్ ఆవరణలో ప్రియదర్శిని పాఠశాల ఎదురుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మిమిక్రీ ప్రదర్శన, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, సినిమా డబ్బింగ్ ఆర్టిస్టు ఎం.జితేంద్ర ప్రదర్శన ఉంటుందన్నారు. అదేవిధంగా షేక్ కరీముల్లా నటరాజ నృత్య కళామందిర్ వారిచే కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యప్రదర్శనలు జరుగుతాయన్నారు. కవులు, కళాకారులను ఆదరించి వారిని ప్రోత్సహించడమే అరుణభారతి సంస్థ లక్ష్యమన్నారు. గతంలో తమ సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. భవిష్యత్‌లో అరుణభారతి సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు.

యాగంటిలో చిత్ర దర్శకుడు సుకుమార్



అభిమానులతో చిత్ర దర్శకుడు సుకుమార్

బనగానపల్లె, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామిని ప్రముఖ చిత్రదర్శకుడు సుకుమార్ సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. పూజారులు సుకుమార్‌కు తీర్థ ప్రసాదాలు అందించారు. పుష్ప-3 సినిమా చిత్రీకరణ నేపథ్యంలో యాగంటికి వచ్చినట్లు సమాచారం. పలువురు అభిమానులు సుకుమార్‌తో సెల్ఫీలు దిగి సందడి చేశారు.

ఉపాధి కూలీలకు ఊరట

జిల్లాకు రూ.40 కోట్లు విడుదల



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ కూలీల 80 రోజుల నిరీక్షణకు తెరపడింది. జనవరి నుంచి ఇప్పటి దాకా పేరుకుపోయిన ఉపాధి కూలీల బకాయిలో రెండు నెలల మొత్తాన్ని అంటే రూ.40 కోట్లను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ వెంకటరమణయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఢిల్లీకి వెళ్లి ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రూ.800 కోట్ల బకాయిలు ఉండగా.. అందులో రూ.600 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసినట్లు నీటి యాజమాన్య సంస్థ అధికారవర్గాలు తెలిపాయి. జిల్లాలో 15 లక్షల పనిదినాలకు రూ.40 కోట్లు విడుదలయ్యాయని, త్వరలోనే మిగిలిన పని దినాల వేతన బకాయిలు విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత పెరుగుతుండటం, వ్యవసాయ పనులు లేకపోవడం ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు లక్ష్యం కావడంతో కూలీలు ఉదయం 7 గంటలకే పనికి వెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి కూలీల మొత్తాన్ని రూ.307లకు పెంచింది. నిబంధనల మేరకు 15 రోజులకు ఒకసారి వేతనాలు చెల్లించాలి. ఎప్పటికప్పుడు ఎఫ్‌టీవో అప్‌లోడు చేసిన 15 రోజులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. అయితే.. ఈసారి మూడు నెలలుగా ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో కూలీల సంఖ్య తగ్గిపోతోంది. ఇటీవల కలెక్టర్ రంజిత్ బాషా గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సింది పోయి భారీ ఎత్తున పనిదినాల లోటు కనిపిస్తోందని, వెంటనే ఆ శాఖ సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకు జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి కూలిలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

రోజుకు పనుల్లో 80వేల నుంచి 90వేల దాకా : కర్నూలు జిల్లలో ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్లు ముగిసిపోయాయి. ముఖ్యంగా పశ్చిమ ప్రాంత నియోజకవర్గాలు పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, ఆదోని, డోన్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున కూలీలు గుంటూరు, బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాలకు పని కోసం వలస వెళ్తున్నారు. గ్రామాలకు గ్రామాలు వలస వెళ్తున్నా స్థానికంగా పనులు కల్పించడంలో అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు ఏ మాత్రం పని చేయడం లేదు. కర్నూలు జిల్లాలో 3.50 లక్షల కుటుంబాలకు జాబ్ కార్డులు ఇచ్చారు. ఏప్రిల్ నుంచి మే, జూన్ నెలలో దాదాపు ప్రతిరోజు లక్ష మందికి పనులు కల్పించాలని నీటి యాజమాన్య సంస్థ అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అయితే వివిధ కారణాల వల్ల మొదట్లో 50వేల మంది మాత్రమే పని చేస్తూ వచ్చారు. ప్రస్తుతం కలెక్టర్ ఒత్తిడి మేరకు 80 నుంచి 90 వేల మంది దాకా పనులకు వస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి. ఎండలు మండిపోతుండటంతో పాటు వడదెబ్బ సోకి పలువురు గాయాల పాలవుతుండటంతో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతోంది. ప్రభుత్వం ఉపాధి పనులు చేసే వారికి రోజుకు రూ.307 చెల్లిస్తామని ప్రకటించినా ఆ మేరకు మొత్తం కూలి అందడం లేదు. పూర్తి స్థాయిలో వేతనం అందించేందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పలు చర్యలు చేపట్టిందని డ్వామా పీడీ వెంకటరమణయ్య తెలిపారు.

పంచమవేదంగా శాస్త్రీయ నృత్యం

- సంస్కృతిని ప్రతిబింబించే పలు నృత్యరీతులు
- ఆదరణ కోల్పోతున్న జానపద, సంప్రదాయ కళలు
- నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం



నాట్యం చేస్తున్న కళాకారిణి



ప్రతి జాతికి కొన్ని నాట్య పద్ధతులు ఉంటాయి. ఆదిమ యుగం నుంచి జానపద నాట్యరీతులు కొనసాగుతున్నాయి. మధ్యలో సంప్రదాయ నృత్యాలు వచ్చాయి. ప్రజల కళా వ్యక్తీకరణలో నాట్యం ఒకటి. ఇటీవల జానపద, సంప్రదాయ నాట్యాలు రెంటికీ ఆదరణ తగ్గిపోతోంది. తిరిగి అన్ని రకాల నాట్యకళలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 29న అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని నిర్వహించాలని యునెస్కో నిర్ణయించింది. ఇందులో భాగమైన అంతర్జాతీయ డాన్స్ కౌన్సిల్ సహకారంతో 1982 నుంచి అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. నేడు అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా కథనం.

ఆత్మకూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అతిప్రాచీన వేదాల కలయికతో పంచమ వేదమైన నాట్యం జీవం పోసుకుందని అంటారు. నాలుగు వేదాల నుంచి 4 నాట్యాంగాలను బ్రహ్మ గ్రహించి నాట్య వేదాన్ని నిర్మించారని నమ్మకం. అయితే మానవ శ్రమ నుంచి కళలు వికసించాకని, నాట్యం అందులో ఒకటి అని మానవ శాస్త్రం, చరిత్ర నిర్ధారిస్తున్నాయి. కూచిపూడి, భరతన్యాటం, కథక్, కథకళి, మణిపురి, ఒడిస్సీ, మోహినీ ఆట్టం వంటి సంప్రదాయ నృత్యాలకంటే అత్యంత ప్రాచీనమైనవి గిరిజన, జానపద నృత్యాలు, వీధినాటకం, బుర్రకథ, గంటపర్థాల, కోలాటం, పేరిణి, తోలుబొమ్మలాట, థింసా నృత్యం, చిందు నృత్యాలు. ఇవి మానవుల శ్రమ నుంచి, సృజనాత్మకత నుంచి పుట్టి కొనసాగుతున్నాయి.

సంప్రదాయ నృత్యాలైన కూచిపూడి, భరతన్యాటం, కథక్, కథకళి, మణిపురి, ఒడిస్సీ, మోహినీ ఆట్టం వంటి నాట్యాలపై కూడా కళాకారుల్లో ఆసక్తి తగ్గిందని చెప్పవచ్చు. ఎంతో సాధనతో కూడిన ఈ కళలపై పట్ల నేటి సమాజంలో కొద్దిగా ఆదరణ వున్నప్పటికీ గ్రామీణ స్థాయిలో మాత్రం ఈ కళలను నమ్ముకున్న వారికి ఎలాంటి ప్రోత్సాహం ఉండటం లేదు. జానపద, ప్రజా కళలు కూడా ఆదునిక సినిమా, టీవీ వంటి వాటి వల్ల ఆదరణ కోల్పోతున్నాయి. వీటన్నిటికీ ప్రభుత్వం చేయూతనందించాల్సి ఉంది.



సంప్రదాయ నృత్యంలో సాయి లిక్షితాశ్రీ ..

నందికొట్కూరు పట్టణానికి చెందిన జగదీశ్వరుడు, శ్రావణి దంపతుల కుమార్తె సాయి లిక్షితాశ్రీ కూచిపూడిలో 2600కు పైగా ప్రదర్శనలు చేసి అరుదైన రికార్డులను సొంతం చేసుకుంది. చిన్నతనం నుంచే ఓ వైపు చదువుల్లో రాణిస్తూ మరో వైపు సంప్రదాయ నృత్యంలో తనకంటూ ఓ ప్రత్యేతను సంపాదించుకుంది. ప్రస్తుతం నందికొట్కూరులోనే ఎంఎస్సీ చదువుతున్న సాయిలిక్షితాశ్రీ 13ఏళ్ల వయసులోనే 21 ఉన్నతస్థాయి అవార్డులను, బిరుదులను సొంతం చేసుకుంది. 2015 జనవరి 26న జరిగిన గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా రాష్ట్రపతి అవార్డును దక్కించుకుంది. హైద్రాబాద్‌లో 2013లో ఆరుగంటల పాటు నిర్విరామంగా కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించుకుంది. 2012లో అన్నమయ్య కీర్తనల్లో 12గంటల పాటు కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రపంచ స్థాయి అవార్డును కూడా దక్కించుకుంది. 2022లో దూరదర్శన్ వారు గ్రేడ్ ఆర్టిస్ట్‌గా గుర్తింపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంలో లిక్షితాశ్రీ నృత్య కళాశాల పేరుతో ఆసక్తి గల కళాకారులు సంప్రదాయ నృత్యంపై శిక్షణ ఇస్తున్నారు.



నేడు టీజీవీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం, శ్రీ నటరాజ నృత్య కళామందిర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం, కూచిపూడి, భరతనాట్యం వర్క్‌షాప్ ముగింపు వేడుకలు నిర్వహిస్తున్నట్లు నృత్య గురువు ఎస్.కరీముల్లా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, హైదరాబాదు స్కూల్ ఆఫ్ డ్యాన్స్ డైరెక్టర్ పద్మా కల్యాణ్, ప్రొద్దుటూరు నాట్యాచార్యుడు పఠాన్ మొహిద్దీన్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన కళాకారులతో నృత్య ప్రదర్శనలు ఉంటాయని కరీముల్లా పేర్కొన్నారు.

● నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వేసవి సెలవుల్లో బాలబాలికలకు కూచిపూడి నృత్యంలో శిక్షణలు అందిస్తున్నారు. అలాగే సెలవుల అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు కూడా ఈ శిక్షణలు కొనసాగుతున్నాయి. నగరంలో నృత్య గురువులు భార్గవ్, ఎస్. కరీముల్లా, నాగసాయి ప్రదీప్, సూర్యకళా అకాడమీ అధ్యక్షుడు బి. సుధాకర్ వంటి వారు కూచిపూడి, భరతనాట్యం అంశాలలో శిక్షణలు ఇస్తున్నారు.



ఇటీవల టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన జాతీయ నృత్య సమ్మేళనంలో కళాకారులు (ఫైల్)

భావి తరాల కోసమే శిక్షణ



శాస్త్రీయ నృత్యాలను భావి తరాలకు అందజేసేందుకు నిత్యం శిక్షణలు అందిస్తున్నాం. వేసవిలో కళాక్షేత్రంలో ప్రత్యేక షార్ట్ టైమ్ శిక్షణలతోపాటూ ఇతర రోజుల్లో వారంలో మూడు రోజుల పాటు శిక్షణలు ఇస్తున్నాం. గత 18 ఏళ్లుగా శిక్షణలు ఇస్తున్న నాకు భారతీయ నాట్య మయూరి అవార్డు, నృత్య శేఖర అవార్డు, నృత్య శిరోమణి, నాట్య కళారత్నం వంటి అవార్డులు లభించాయి. అలాగే నగరంలో ఏటా రెండు సార్లు జాతీయ స్థాయిలో నృత్య పోటీలు నిర్వహిస్తూ వివిధ రాష్ట్రాల కళాకారులతో ప్రదర్శనలు ఇప్పిస్తూ ఆ కళారీతులను జిల్లా వాసులకు పరిచయం చేస్తున్నాను. హైదరాబాదు దూరదర్శన్ కేంద్రం నాకు బి గ్రేడ్ ఆర్టిస్టుగా గుర్తింపు పత్రం ఇచ్చింది.

- ఎస్ కరీముల్లా, నృత్య గురువు, కర్నూలు

పద్మశ్రీ అందుకున్న ఐఐఐటీడీఎం చైర్‌పర్సన్ విజయలక్ష్మి

● కర్నూలు క్యాంపస్‌లో సంబరాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఐఐఐటీడీఎం గవర్నింగ్ బోర్డు చైర్ పర్సన్ డాక్టర్ దేశమానే విజయలక్ష్మికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించింది. ఈ అరుదైన పద్మశ్రీ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో విజయలక్ష్మి అందుకున్నారు. వైద్యరంగంతో పాటు విద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేసినందుకు గానూ ఆమెకు పద్మశ్రీ వరించింది. 1955లో కర్ణాటక రాష్ట్రం కలబురిగి జిల్లాలోని జేవరధి తాలుకాలోని కోబాళ్ గ్రామంలో జన్మించిన ఆమె కృషి, పట్టుదల, సేవాభావంతో దేశం గర్వించేస్థాయికి ఎదిగారు. తండ్రి బాబురావు టెక్స్‌టైల్ మిల్లులో కార్మికుడిగా పని చేశారు. తల్లి ఇంటింటికి వెళ్లి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం గడిపారు. విజయలక్ష్మి 2015లో బ్రెస్ట్ క్యాన్సర్ స్పెషలిస్టుగా పదవీ విరమణ పొందారు. 2024లో భారతీయ సమాచార్ సాంకేతిక డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ (ఐఐటీడీఎం కర్నూలు) గవర్నింగ్ బోర్డు చైర్ పర్సన్‌గా నియమితులయ్యారు. డాక్టర్ విజయలక్ష్మి పద్మశ్రీ అవార్డు అందుకోవడంతో కర్నూలు ఐఐఐటీడీఎం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గురుమూర్తి ఆధ్వర్యంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది సంబరాలు చేసుకున్నారు.



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి

ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధికి సహకరించండి

● కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్


కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కోరారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను టీజీ భరత్ కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబధించి కీలక అంశాలపై చర్చించామని, రాష్ట్రంలో టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో అపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత, రెండో విడత మొత్తం రూ. 9.76 కోట్లు విడుదల చేశామని, 6 నెలల్లోపు ప్రాజెక్టును పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరామని తెలిపారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఎంకేవైసీ స్కీమ్ కింద ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకునేలా ఏపికీ వెసులుబాటు కల్పించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.

రుణాలు వినియోగించుకోండి

నంద్యాల రూరల్ ఏప్రిల్, 28 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ సూచించారు. సోమవారం స్థానిక పద్మావతి నగర్‌లోని కార్యాలయంలో ముస్లింలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీల అభ్యున్నతికి ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రూ.174 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వివిధ రకాల ఉపాధి, శిక్షణ కార్యక్రమాల కోసం రూ.21 కోట్ల ప్రస్తుతం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నీట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నీట్ యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైన్ డిపార్టుమెంటు అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే 4న నీట్ యూజీ పరీక్ష నగరంలోని 16 కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు 4466 విద్యార్థులు హాజరు కానున్నారని, మే 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఒక్కొక్క పరీక్ష కేంద్రం వద్ద 2+2 పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఒక హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, నోడల్ అధికారి పాయల్ ప్రియదర్శిని, డీఎస్పీ బాబు ప్రసాద్, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

పాలిసెట్‌పై డీఆర్వో సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కామన్ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయా లని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 30న నిర్వహించే కామన్ పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్స్ నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 12 సెంటర్లలో 4584 మంది, ఆదోనిలోని 10 సెంటర్లలో 2768 మంది మొత్తం 22 సెంటర్లలో 7352 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవు తున్నారని తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబడవని అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో విజయశ్రీ, పాలిటెక్నిక్ ఎగ్జామినేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఓ.శ్రీధర్, కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు, అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరం జాయింట్ కన్వీనర్‌గా బైరెడ్డి శబరి



నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరిని ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరం జాయింట్ కన్వీనర్‌గా భారత ప్రభుత్వం నియమించింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా చైర్మన్‌గా వ్యవహరిస్తారు. పార్లమెంట్ సభ్యులకు భారతదేశంలో ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించడంలో విశేషమైన సహకారం అందిస్తుందని బైరెడ్డి శబరి తెలిపారు. 2006లో ఐఎంపీఎఫ్ ప్రారంభమై దేశం ఆరోగ్యం సంరక్షణ ల్యాండ్‌స్కేప్‌లో కీలకమైన శక్తిగా ఉద్భవించిందన్నారు. పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన వైద్య నిపుణులతో కూడిన ఫోరం క్లిష్టమైన ఆరోగ్య సమస్యలపై ప్రజలకు, పార్లమెంట్‌కు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి వీలు కల్పిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి శబరి కృతజ్ఞతలు తెలిపారు.

15 లోగా పొగాకు కొనండి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మే 15 తేదీలోపు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య పొగాకు కంపెనీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పొగాకు కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధర ఇవ్వాలని సూచించారు. ఈ విషయానికి సంబంధించి కంపెనీ ప్రతినిధులతో మరొక సమావేశాన్ని నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకు పూర్తిగా మంచి ధరతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ స్పష్టం చేశారు.

అర్ధరాత్రి హైడ్రామా


హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

(5వ పేజీ తరువాయి)


లక్ష్మీనారాయణ (ఫైల్)

హత్య జరిగిన ప్రదేశం చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోకి మారడంపై బాధితవర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. కేసు గుంతకల్లులోనే నమోదు చేయాలని, అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని లక్ష్మీనారాయణ కుటుంబం, బంధువులు డిమాండ్ చేశారు. చిప్పగిరి స్టేషన్‌లో విచారణ జరిగితే తమకు న్యాయం జరగదని సందేహాన్ని వ్యక్తంచేశారు. ఓ పోలీసు అధికారి కారణంగా తమకు అన్యాయం జరిగిందని, ఆయన ఆధ్వర్యంలో విచారణ పారదర్శకంగా సాగుతుందన్న నమ్మకం లేదన్నారు. ఉన్నతాధికారితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సాంకేతికంగా ఎదురయ్యే సమస్యలను పోలీసులు బాధిత వర్గానికి వివరించారు.

నలుగురిపై కేసు

చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న ఆయన కుమారుడు వినోద్‌కుమార్ నుంచి చిప్పగిరి పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. చిప్పగిరికి చెందిన వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున చౌదరి, కొండా రామాంజనేయులు, అరికెర మల్లికార్జునను నిందితులుగా పేర్కొంటూ వినోద్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన టిప్పరు డ్రైవర్‌ను చిప్పగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. టిప్పర్ యజమాని, డ్రైవర్‌ను విచారించడం ద్వారా కేసును రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరించే అవకాశాలు ఉన్నాయి. చిప్పగిరి లక్ష్మీనారాయణ గుంతకల్లులో చేసిన పంచాయితీలపై కూడా కొందరిని పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించే అవకాశాలున్నట్టు తెలిసింది. గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఉదయం 11 గంటల ప్రాంతంలో చిప్పగిరికి తరలించారు.

చిప్పగిరిలో లక్ష్మీనారాయణ అంత్యక్రియలు

ఆలూరు/చిప్పగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. దారుణ హత్యకు గురైన లక్ష్మీనారాయణ అంత్యక్రియలు సోమవారం చిప్పగిరిలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. అంత్యక్రియలకు కాంగ్రెస్ పార్టీతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు వేలాదిగా తరలివచ్చారు. మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌మాదిగ, నంద్యాల డీసీసీ అధ్యక్షులు జెంగిటి లక్ష్మీనారాయణ తదితరులు చిప్పగిరి లక్ష్మీనారాయణ పార్థివదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసుల వైఫల్యంతోనే లక్ష్మీనారాయణ హత్య జరిగిందన్నారు. తనపై హత్యకు కొందరు కుట్ర చేస్తున్నారంటూ పలుమార్లు డీఎస్పీతో పాటు ఎస్పీ ఎదుట లక్ష్మీనారాయణ మొరపెట్టుకున్నా పోలీసులు రక్షణ కల్పించలేదన్నారు. తక్షణమే పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మీనారాయణ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి హంతకులను కఠినంగా శిక్షించాలన్నారు. దళితుల సంక్షేమానికి లక్ష్మీనారాయణ పోరాటాలు చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, ప్రభాకర్, బోయ క్రాంతినాయుడు, రమేష్‌యాదవ్, మురళీకృష్ణంరాజు, బజారన్న, మహేంద్రనాయుడు, నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుపాల్, సుభాష్, గాదిలింగ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఫోన్‌లో పరామర్శించిన వైఎస్ షర్మిల

హత్యకు గురైన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలన్నారు. హత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని కర్నూలు ఎస్పీని కోరినట్లు తెలిపారు.

లోపించిన శాంతిభద్రతలు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నంద్యాల డీసీసీ అధ్యక్షుడు

కల్లూరు, ఏప్రిల్ 28 :(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళిత బహుజన, గిరిజన, మైనార్టీలపై రోజు రోజుకూ హత్యలు పెరుగుతున్నాయని, రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయన్నారు. ఈ అంశాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళతామన్నారు. పోలీసుల వైఫల్యంతోనే హత్య జరిగిందని తక్షణమే పత్తికొండ డీఎస్పీని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జెంగిటి లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాష్ట్ర మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీతో కలిసి చిప్పగిరిలో లక్ష్మీనారాయణ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో తీవ్ర ఉద్రిక్తత

● కల్వటాలవాసిపై కాంట్రాక్ట్ కంపెనీ ఉద్యోగుల దాడి ● పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో సోమవారం మధ్యాహ్నం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. కల్వటాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు క్రిష్ణ రంగారెడ్డి రామ్‌కో పరిశ్రమలోని ఓ సబ్ కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధి వద్దకు వెళ్లి వర్కులపై చర్చించారు. స్థానికంగా ఉన్న తమకు కాంట్రాక్ట్ పనులు కల్పించాలని కోరారు. అయితే సదరు ప్రతినిధి నిర్లక్ష్యంగా, అవమానకర రీతిలో సమాధానం చెప్పడంతో మాటా మాటా పెరిగి, ఘర్షణ పడ్డారు. ఇంతలోనే సిబ్బంది టీడీపీ నాయకుడిపై దాడికి యత్నించారు. అనుచరులపై దాడి చేసి గాయపరిచారు. ఓ వాహనంపై దాడి చేయడంతో అద్దాలు పగిలిపోయాయి. దీంతో పరిశ్రమలో ఏం జరుగుతుందో అర్థంకాక కిందిస్థాయి సిబ్బంది, కార్మికులు తీవ్ర ఆందోళన చెందారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాంట్రాక్ట్ కంపెనీలో పనిచేసే నాన్‌లోకల్ సిబ్బంది స్థానికులపైనే దాడికి యత్నించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఉద్రిక్తత తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. అయితే ఇరువర్గాలు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని సీఐ వెల్లడించారు.


దాడికి యత్నిస్తున్న ప్రైవేటు కాంట్రాక్ట్ కంపెనీ సిబ్బంది

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

కుటుంబంలో విషాదం


జనార్దన్ (ఫైల్)

రుద్రవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సిబ్బంది చేయవలసిన పని ఇతరులు చేయవలసి రావడంతో రుద్రవరంలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. గ్రామంలో వరి బస్తాల లోడ్‌తో వెళుతున్న లారీలకు విద్యుత్ సర్వీసు వైర్లు తగులుతుండడంతో సర్వీసు వైరును సరిచేయడానికి 11కేవీ విద్యుత్‌స్తంభాన్ని జనార్దన్(42) ఎక్కాడు. సర్వీసు వైరుకు ఉన్న జీ వైరు 11 కేవీ వైరుకు తగలడంతో విద్యుత్ సరఫరా అయి స్తంభం నుంచి కింద పడ్డాడు. అతడ్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. విద్యుత్ వైర్లు, విద్యుత్ సర్వీసు వైర్లలో ఏదైనా సమస్య ఉంటే లైన్‌మెన్లు సరి చేయాలి. విద్యుత్ లైన్‌మెన్లు గ్రామస్తుల సపోర్టు తీసుకుని పనులు చేయిస్తున్నారు. ఇది ఎంత వరకు సమంజసమని స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మృతుడు జనార్దన్ భార్యవిజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

ఎల్‌సీ తీసుకోలేదు: సబ్ ఇంజనీరు రాజశేఖర్

రుద్రవరం సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోలేదు. ఏదైనా విద్యుత్ వైర్లు సరి కానప్పుడు ఎల్‌సీ తప్పకుండా తీసుకోవాలి. ప్రమాద సంఘటన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. . లైన్‌మెన్ దగ్గర ఉండి ఈ పని బాధ్యతగా చేయించాల్సిన పని ఇది.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

పెద్దకడబూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో కొంతమంది దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. దొడ్డిమేకల గ్రామంలోని పురాతనంగా ఉన్న తిమ్మప్పస్వామి దేవాలయం ముందు కొంతమంది ఎక్స్‌వేటర్‌తో గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఈ ఘటనను స్థానిక రైతులు ఆలస్యంగా గుర్తించారు. గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పాములపాడు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామానికి చెందిన లావణ్య (35) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. అప్పుల బాధ తాళలేక సోమేశ్వరుడు అనే రైతు తన కుటుంబ సభ్యులైన తల్లి, భార్య, కుమార్తె, కుమారుడుకి గతనెల 3న కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలపి ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విదితమే. కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గత కొద్దిరోజుల క్రితం సోమేశ్వరుడు కుమారుడు భరత్ మరణించగా, సోమవారం భార్య లావణ్య మరణించింది. మిగతా కుటుంబ సభ్యులు చికిత్స పొందుతున్నారు.

కర్నూలులో వ్యక్తి..

కర్నూలు క్రైం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌కు చెందిన పాపరాయుడు (43) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పాపరాయుడు సెంట్రింగ్ పని చేస్తూ జీవనం సాగించేవారు. ఆయనకు భార్య మణెమ్మ, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. గత కొంత కాలంగా సెంట్రింగ్ పని మానేసి మద్యానికి బానిసయ్యారు. ఈ నెల 8వ తేదీన తాగిన మైకంలో భార్యను భయపెట్టాలనే ఉద్దేశంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. బంధువులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌గౌడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలోని నలంద బీఈడీ కళాశాల సమీపంలో ఆదోని- ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. ఏఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలివీ.. చిత్తూరు జిల్లా పూతలపట్టు గ్రామానికి చెందిన సుమతి, ధరణి, నాగమ్మ కోడి పిల్లల వ్యాపారం చేసుకునేందుకు ఆదోని నుంచి ఆటోలో ఎమ్మిగనూరుకు బయలు దేరారు. ఆదోని నుంచి అతివేగంగా వస్తున్న ట్రాలీ వాహనం ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుమతి(45) అక్కడికక్కడే మృతి చెందగా.. ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ధరణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఈడీ సెమిస్టర్‌లో ఇద్దరు డీబారు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్‌లో ఇద్దరు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 14 పరీక్ష కేంద్రాల్లో 3,384 మంది దరఖాస్తు చేసుకోగా, 2,992 మంది పరీక్షలు రాశారని పేర్కొన్నారు. జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డోన్‌లో ఒకరు, శ్రీసుధా కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ డోన్‌లో మరొకరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబారు చేశామని తెలిపారు.

కలపరిలో జ్వరాల కలకలం

● తగ్గని జ్వరాలు, వైరల్ ఫీవర్ కేసులంటున్న అధికారులు
● నేడు కలపరిలో పర్యటిస్తున్న స్టేట్ వైద్యాధికారులు


యంకమ్మ (ఫైల్)

కర్నూలు హాస్పిటల్/ఆస్పరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విష జ్వరాలతో ఆస్పరి మండలం కలపరి గ్రామం వణుకుతోంది. గ్రామంలో 350 మందికి పరీక్షలు నిర్వహించగా.. 53 మందికి విషజ్వరాలు సోకినట్లు వైద్యఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నిర్వహించిన పరీక్షల్లో ఏకంగా 10 మందికి చికెన్‌గున్యా పాజిటివ్ కేసులు నమోదు కావడం కలకలం రేపింది. ఒకేసారి 10 కేసులు రావడంపై వైద్యాధికారులు ప్రజల్లో ఆందోళన మొదలైంది. వాస్తవానికి చికెన్‌గున్యా వ్యాధి దోమల వల్ల వస్తుంది. ఎండాకాలం కావడంతో గ్రామంలో దోమలే లేవని ఎలా ఈ కేసులు వచ్చాయో అర్థం గాక వైద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన 60 ఏళ్ల యంకమ్మ కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్యులు మాత్రం రోగి బ్యాక్టీరియా మెనింజైటిస్‌తో బాధపడుతూ మరణించిందని, ఈ కేసు చికెన్‌గున్యా కాదని వైద్యఆరోగ్య శాఖ అధికారులు తెలియజేశారు. ఇదే గ్రామానికి చెందిన 50ఏళ్ల పెద్ద శేఖన్న కర్నూలు జీజీహెచ్‌లో కీళ్ల నొప్పులు, తీవ్ర ఆయాసంతో బాధపడుతున్నారు. కలపరి గ్రామంలో విషజ్వరాలు, చికెన్‌గున్యా కేసులు నమోదు కావడం ఈ వ్యాధులు అదుపులోకి రాకపోవడంతో రాష్ట్ర వైద్యాధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో గ్రామంలో పరిస్థితిని అంచనా వేయడానికి మంగళవారం స్టేట్ వైద్యాధికారులు రానున్నారు.


గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరం

వైద్య శిబిరం : కలపరి గ్రామంలో విషజ్వరాలు గ్రామంలో ప్రబలడంతో నాలుగు రోజులుగా వైద్యురాలు దుర్గబాయి వైద్యబృందంతో శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. గ్రామంలో డీఎల్‌పీవో వీరభద్రప్ప పర్యటించి పలు మురుగు కాలువలు, వీధులలో దోమలు నివారణకు స్ప్రే చేసి, పారిశుధ్య పనులు చేపట్టారు.

నష్టపరిహారం చెల్లించాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు, లబ్ధిదారులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దళితులు, పేదలు ప్రభుత్వ భూములను సాగు చేస్తుండగా.. ప్రభుత్వం వారిని పేదలుగా గుర్తించి 27 సంవత్సరాల క్రితం 155/ఏలో పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేశారని, అప్పటి నుంచి పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. అలాంటి భూములకు పూర్తి స్థాయి నష్టపరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనీ అన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు షాజహాన్, మధుసూదన్, సుధాకర్, రామకృష్ణ, రామకృష్ణుడు, మల్లేష్, మాసుంబాషా పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యతోనే ఉద్యోగావకాశాలు సాధ్యమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. సోమవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రం లో విద్య అకాడమీలో పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు శిక్షణ తీసుకుం టున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో చిన్న వయస్సులోనే ఉన్నతమైన ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడవచ్చని అన్నారు. కార్యక్రమంలో విద్య అకాడమీ డైరెక్టర్ కె.వెంకటేశ్వరమ్మ, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ అడ్వకేటు కోనేటి వెంకటేశ్వర్లు, విద్యావేత్తలు డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, జి.పుల్లయ్య, డాక్టర్ కొట్టే చెన్నయ్య, కార్తీక్ నాయుడు, రఘువీర్, బాలరాజు, చింతలపల్లి రామకృష్ణ, టి.గోపీనాథ్, అంచ పెద్దస్వామి, బుర్రా చంద్రమోహన్, సురేంద్ర బాపూజీ, ముద్దం మధుసూదనరావు, విశ్రాంత ఆర్డీవో కోనేటి చంద్రబాబు, విశ్రాంత ఆర్మీ కెప్టెన్ సాన మద్దిలేటి పాల్గొన్నారు.

'పొగాకును కొనుగోలు చేయాలి'

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన బర్లీ పొగాకు పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. జగన్నాథం మాట్లాడుతూ గత సంవత్సరం బర్లీ పొగాకుకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సంవత్సరం కూడా రైతులు జిల్లాలోని వివిధ మండలాల్లో పొగాకు పంటను సాగుచేశారన్నారు. పొగాకును రైతుల నుంచి క్వింటానికి రూ.15000 ప్రకారం అగ్రిమెంటు చేసుకుని పంట చేతికి వచ్చిన తరువాత ఆ ధర కొనలేమని కంపెనీలు చేతులెత్తేశారని అన్నారు. ఈ పరిస్థితుల్లో క్వింటానికి రూ.18000 ప్రకారం ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పంపన్నగౌడు, ఉపాధ్యక్షుడు రాజాసాహెబ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బకాయి వేతనాల చెల్లింపునకు కృషి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో పని చేస్తున్న 24 మంది పారిశుధ్య కార్మికుల ఆరు నెలల వేతనాలు మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపులు త్వరలోనే చేసేందుకు కృషి చేస్తామని కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కేఎంసీ వర్కర్స్ యూనియన్ నాయకులు వైవీ రమణ, ఎంవీ నారాయణకు కమిషనర్‌కు వినితి పత్రం అందజేశారు. కార్యక్రమానికి 13 అర్జీలు రాగా వాటి పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీ ఇచ్చారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వ రరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

పొలాల్లో గడ్డికి నిప్పు పెట్టొద్దు: ఏడీఏ

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పొలాల్లో గడ్డికి నిప్పంటించడం వల్ల భూమి భౌతిక స్థితి దెబ్బతింటుందని కర్నూలు డివిజన్ ఏడీ శాలురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొలాల్లో గడ్డికి నిప్పంటించడం వల్ల పంట ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడే సేంద్రియ తర్బనం, నత్రజని, సూక్ష్మ పోషకాలు పూర్తిగా నశిస్తాయన్నారు. గడ్డిని కాల్చివే యడం వల్ల పంటలో కలుపు తగ్గుతుందని రైతులు భావిస్తున్నారని, అయితే కలుపు మొక్కలతోపాటు పంట కూడా సరిగ్గా ఎదగదన్న విషయాన్ని రైతులు గుర్తించుకోవాలన్నారు. నేలకు మేలు చేసే వాన పాములు, మైత్రి పురుగులు నశించి పొలంలో సారాన్ని అందించే కీటకాలు చనిపోయి పంట ఎదిగే అవకాశం లేక దిగుబడి తగ్గిపో తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులు గడ్డిని పొలాల్లో మండించకుండా అక్కడే గడ్డి కరిగిపోయేలా దున్నాలన్నారు.

మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన

కర్నూలు క్రైం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సిస్టర్ స్టాన్సిల్లా పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా ఈగల్ ఎస్ఐ సృజన్ కుమార్, ఎన్‌సీసీ మేనేజర్ వైవీసీకే రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించేందుకు, నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పాఠశాలలో మాదక ద్రవ్యాల నివారణ కార్యక్రమాలు అమలు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గురించి వివరించారు. ఈగల్ సిబ్బంది పర్వాద్‌ఖాన్, రమేష్, మాసూంవలి, ఎన్‌సీసీ సిబ్బంది సుధీర్ కుమార్, విజయకుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కిషోర బాలికల కోసం సమ్మర్ ప్రోగ్రాం: పీడీ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల సాధికారతలో భాగంగా సమ్మర్ స్పెషల్ ప్రోగ్రాం మే నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కిషోర బాలికల సాధికారతలో భాగంగా వేసవి సెలవులో ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్ గురించి పీడీ వివరించారు.

రైతు విశిష్ట కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

సి.బెళగల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసుబుక్‌లు ఉన్న రైతుంతా విశిష్టకార్డుకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో మల్లేష్ కుమార్ సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఎంపీఈవోల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని రైతులకు ఎంపీఈవోలు అందుబాటులో ఉండాలన్నారు.

మొదటి సెమిస్టర్ పరీక్షలపై విచారణ చేపట్టాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న బీఎడ్ కళాశాలల మొదటి సెమిస్టర్ పరీక్షలపై సమగ్ర విచారణ చేపట్టాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య, యూఎస్ఎఫ్ఐ నాయకులు శేఖర్ నాయుడు ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బీఎడ్ కళాశాలలో ఈ నెల 23న మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే పరీక్షలు రాస్తున్న విద్యార్థుల నుంచి కళాశాలల యాజమాన్యం ముడుపులు పుచ్చుకుని ఒకరోజు ముందే దాదాపు 40 మంది విద్యార్థుల దగ్గర బీఎడ్ అడ్మిషన్లు తీసుకుని మరుసటి రోజే పరీక్షలకు అనుమతినిచ్చిందన్నారు. అలాగే ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో కర్నూలు నగరంలోని ఉస్మానియా కాలేజీలో అభ్యర్థులను మార్చి పరీక్షలను రాయిస్తున్న కూడా ఆర్‌యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు.

జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలి: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని యూనైటెడ్ జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.విద్యాసాగర్, డి.చంద్రమోహన్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్, మధు, నగర కార్యదర్శి మునిస్వామిలు ప్రభుత్వాన్ని కోరారు. వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ పి.చంద్రమోహన్, మధు మాట్లాడుతూ గత ప్రభు త్వ హయాంలో జర్నలిస్టులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 142 జీవో అమలు చేసి అక్రిడిటేషన్ల కోత పెట్టడంతో జర్నలిస్టులకు నష్టం వాటిల్లిందన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వారు వినతిపత్రం అందజేశారు. నాయకులు కిషోర్, జి.విజయ్, కుమార్, వి.విజయకుమార్, నగర కోశాధికారి సంధ్య ప్రసాద్, కల్లూరు మండల కార్యదర్శి లోకేశ్, రాజు, దామోదరం సంజీవయ్య పాల్గొన్నారు.

● ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి గతంలో మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌తో నిర్ధారించిన అంగవైకల్య శాతం కంటే ప్రస్తుతం మెడికల్ బోర్డులో గణనీయంగా తగ్గించడం వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు తిరిగి అంగవైకల్య నిర్ధారణ పరీక్షలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మరియానందం, ఎన్నికల కమిటీ సభ్యుడు టీవీ రామకృష్ణయ్య, పీఈటీ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

● భవన కార్మికులు పని చేసే స్థలంలో తాగునీరు, షెడ్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయించాలని, అర్హులైన భవన కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇప్పించాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ కర్నూలు అధ్యక్షుడు ఎస్.ఖాజాపాషా, కార్యదర్శి కే.సుదాకరప్ప కలెక్టర్‌ను కోరారు.

● 29వ వార్డు షరీఫ్‌నగర్‌లో డ్రైనేజీ సరిగ్గా లేనందున రోడ్లపైకి మురు గునీరు ప్రవహిస్తుందని, డ్రైనేజీ కాలువలను మరమ్మతు చేయించాలని కాలనీవాసులు డి.శ్రీనివాసులు, ఎస్.జయలక్ష్మి, వి.మహబూబ్ బాషా కలెక్టర్‌కు విన్నవించారు.

● ఉమ్మడి జిల్లాలోని కోడుమూరు, పత్తికొండ, వెల్దుర్తి, క్రిష్ణగిరి, తదితర మండలాల్లో ఎక్కువ శాతం బర్లి పొగాకును పండించారని, జీపీఐ అలయన్స్ ఐటీసీ వారు పొగాకును కొంటామని ఇప్పుడు కొనడం లేదని, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొగాకును కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం, జిల్లా సమితి కర్నూలు గౌరవాధ్యక్షుడు కె.జగన్నాథం, అధ్యక్షుడు కే.నాగేంద్రయ్య, కార్యదర్శి పి.పంపన్నగౌడు కోరారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రారంభించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజాబాషా అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. రాధాక్రిష్ణ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని, భవన నిర్మాణ రంగానికి ఉపయోగిం చునే వస్తులపై జీఎస్టీ తగ్గించాలని కోరారు. అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకరప్ప, కార్మిక సంఘం నగర కార్యదర్శి నరసింహులు, నాగరాజు, అబ్దుల్లా, లియాఖత్ అలీఖాన్ పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వెళ్లనీయొద్దు: నగర పాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులు వెనక్కి వెళ్లనీయొద్దని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వివిధ కాలనీల వాసులతో ధర్నా నిర్వహిం చారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ నగర పాలక పరిధిలో నిధులు మంజూరై టెండర్లు పిలిచి భూమి చేసి మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించకుండా వాయిదా వేయడం సరికాదన్నారు. శివారు ప్రాం తాల్లో రోడ్లు వేయాలని అధికారులు చుట్టూ తిరిగి అలసిపో తున్నామన్నారు. నగర పాలకలో విలీనమై 10 ఏళ్లు గడుస్తున్న రహమత్‌నగర్, టీజీఎల్‌కాలనీ, రిచ్‌మండ్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు ఇప్పటి వరకు నిర్మించలేదని అన్నారు. కార్యక్రమంలో శివారు కాలనీల ప్రతినిదులు బి.మల్లికార్జున, ప్రభాకర్‌రెడ్డి, ఎండీ యూనుస్, ఎస్ఆర్.గౌడు, అన్వర్‌బాషా, నయీమ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలేనిరాహార దీక్ష



దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్ఎంయూ నాయకులు

కర్నూలు రూరల్ ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు రీజియన్ వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. అందులో భాగంగా కర్నూలు 1, 2 డిపో ఎదుట సోమవా రం కర్నూలు రీజనల్ వర్కింగ్ ప్రసిడెంట్ పీఏ వలి అధ్యక్షత చేపట్టిన రిలేనిరాహార దీక్షలకు ముఖ్య అతిథిగా ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సి.మద్దిలేటి హాజరై దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏ వలి, మద్దిలేటి మాట్లాడుతూ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌బీఎన్ మూర్తి, కెటి రెడ్డి, సి.లక్ష్మన్న, ఆర్‌పీ రావు, జేబు, రాజేశ్వరయ్య, ఎంజడ్ బాషా పాల్గొన్నారు.

అంధ ఉపాధ్యాయుల అవస్థలు

● సర్టిఫికెట్ల కోసం నిరీక్షణ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దృష్టి లోపం, కంటి చూపులేని ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్ల కోసం పడిగాపులు కాశారు. కర్నూలు జీజీహెచ్‌లో అంధ ఉపాధ్యాయులకు గత శనివారం పరీక్షలు నిర్వహించి ఆలస్యమైందని సోమవారం సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు వెనుదిరిగారు. సోమవారం ఉదయం నుంచి అంధ ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాలో ఆళ్లగడ్డ, నంద్యాల, చిప్పగిరి, ఆలూరు వంటి సుదూరు ప్రాంతాల నుంచి ఒకరి సహాయంతో కర్నూలు జీజీహెచ్‌కు వచ్చారు. సాయంత్రం 5 గంటలైనా మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సాయంత్రం అవుతున్నా తమకు ఎందుకు ఇలా ఇబ్బంది పెడుతున్నారంటూ ప్రశ్నించారు. చూపులేని తాము రాత్రివేళ ఇళ్లకు ఎలా చేరుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా సాయంత్రం 6:30 గంటల తర్వాత 70 మంది చూపులేని ఫియోఫిలిమా ఉపాధ్యాయులకు అధికారులు సర్టిఫికెట్లు అందజేయడం వారు వెనుదిరిగారు.

జాబ్ చార్టు ప్రకారమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జాబ్ చార్టు ప్రకారమే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి గ్రామ ఉద్యాన సహాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవికి వారు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన గ్రూపు మాధ్యమాల నుంచి తాము వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. తాము ఏళ్ల తరబడి పని చేస్తున్నా పదోన్నతులు, బది లీలు లేక పనిభారంతో మగ్గిపోతున్నామని సంఘం అధ్యక్షుడు ఆజాద్, బాషా ఏపీఎంఐపీ పీడీకి మొర పెట్టుకున్నారు.

ఉత్తమ అధ్యాపకుడు వీవీఎస్ కుమార్: వీసీ



వీవీఎస్ కుమార్‌ను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ అధ్యాపకుడు ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ అని క్లస్టర్ ఇన్‌చార్జి ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహించారన్నారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటే శ్వర్లు మాట్లాడుతూ వీవీఎస్ కుమార్ వర్సిటీ అభివృద్ధిలో పాలు పంచుకున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవికారాణి, ఎం పద్మావతి, ఎంసీ సాహిత్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను అందజేస్తున్న నాయకులు

గూడూరు ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమమే పార్టీ ధ్యేయమని నాయకులు తెలుగు శ్రీనివాసులు, అక్కులదేవి గిడ్డయ్య అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని 179 బూత్ పరిధిలో బూత్ ఇన్‌చార్జి ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. వారు మాట్లా డుతూ గూడూరు పట్టణంలో తమకు కేటాయించిన బూత్‌లలో కార్యకర్తలందరికీ టీడీపీ సభ్యత్వ నమోదు చేయించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థల సమస్య పరిష్కారం

ఓర్వకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో సోమవారం వివాదాస్పద స్థల సమస్య ఎట్టకేలకు పరిష్కామైంది. ఓర్వకల్లు బస్టాండు నుంచి మర్రిచెట్టు వరకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మిస్తుండటంతో సమస్య తలెత్తింది. దీంతో మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్వో సోమన్న మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో కొలతలు వేసి హద్దులు గుర్తించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, అబ్దుల్లా, నాగరాజు, అల్లాబాబు, యాసీన్‌బాషా పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

సి.బెళగల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈనెల ఆఖరిలోగా ఈకేవైసీ చేయించుకున్న వారికే రేషన్ బియ్యం మంజూరవుతాయన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్ నవీన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు క్లీన్ అండ్ గ్రీన్

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో మంగళవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు. ప్రతి నెలా సి.క్యాంపు రైతు బజా రులో పరిసరాలను శుభ్రంగా ఉంచి రైతులకు, వినియోగదారులకు మంచి వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. రైతులు, వినియోగదారులు కూరగా యలు అమ్ముకునేందుకు, కొనుగోలు చేసేందుకు రైతుబజారుకు రావద్దని విజ్ఞప్తి చేశారు.

చిత్తశుద్ధి ఏది: ఎస్టీయూ



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జరిగింది. మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ ఇప్పటికే 22 నెలలు ఆలస్యమైనందున వెంటనే పీఆర్‌సీ నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. జీవో.117 రద్దు చేసి కొత్త పాఠశాలల విధానాన్ని అమలు చేసేటప్పుడు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల అభిప్రా యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం మేరకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఆదర్శ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల పదవీ విర మణ వయస్సు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, వెంకటేశ్వర్లు, జి.నాగరాజు మాట్లాడుతూ పురపాలక పాఠ శాలలో పోస్టులను ఉన్నతీకరించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, సి.రమేష్, షఫీ, రాష్ట్ర నాయకులు వీరచంద్ర యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు



విజేతకు కప్పు అందజేస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడులోని క్రేడో స్కూల్‌లో గత రెండు రోజులుగా నిర్వహించిన ఏపీ చెస్ పోటీ లు ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. టీజీవెంకటేశ్ మాట్లాడుతూ చదరంగంతో మేధాశక్తి అలవడుతుందన్నారు. అనంతరం విజేతలైన యశస్విని, అనిమి (అనంతపురం), ప్రథమస్థానం, రెండో స్థానం దుర్గాప్రసాద్ (అనంతపురం), మూడో స్థానంలో అబ్దుల్ రెహిమాన్ (కర్నూలు)లకు టీజీ వెంకటేశ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏపీ చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి, శివరాం, గోవింద్ జియర్, కార్తీక్ కుమార్ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ సూచించారు. సోమవారం ఆయన మాట్లా డుతూ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో బి.క్యాంపు ఒకేషనల్ జూని యర్ కళాశాలలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. గ్రంథాలయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు రామకృష్ణ, రిటైర్డు సివిల్ ఇంజనీర్ రామచంద్రన్, కేశ వయ్య, వన్నూరు బాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు బి.క్యాంప్స్ సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో కరెంట్ ఉండదన్నారు. సోమప్ప కాలనీ, జేసీబంగ్లా, డీజీపీ బంగ్లా, హౌసింగ్‌బోర్డ్, మహాలక్ష్మీ నగర్, ఎఫ్‌సీఐ, డాక్టర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

రమణమ్మ మృతి బాధాకరం

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగం జాతికి సేవలందించిన గుమ్మేట కళాకారిణి సంకుల రమణమ్మ మృతి బాధాకరమని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ అన్నారు. నగర శివారులోని ఎన్టీఆర్ బిల్డింగ్‌లో నివసిస్తున్న ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. సోమవారం మాధవీ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె లబ్ధిదారు చంద్రకళకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.

వీబీఈఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మల్లన్న


కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం (వీబీఈఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా పశుసంవర్థక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తు న్న డాక్టర్ మల్లన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జడ్పీ ఆవర ణలోని ఎంపీపీ హాలులో జరిగిన ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళ నంలో ఆదోని చెందిన టీచర్ సుధాకర్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

హ్యాండ్‌బాల్ కర్నూలు జట్టుకు కమిషనర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కర్నూలు జట్టు స్వర్ణ పతకం సాధించారు. సోమవారం బి.క్యాంపు క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కమిషనర్ రవీంద్రబాబు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకుని ట్రోఫీని అందజేశారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

ఓర్వకల్లు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధమైంది. ఓర్వకల్లు మండలంలో సోమవారం సాయంత్రం భారీ ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో ఎస్సీ కాలనీలోని పిలీపు ఇంటి వద్ద ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడి కాలిపోయింది. ఆ సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న పిలీపు కుమార్తె కస్తూరి చేతికి నిప్పురవ్వలు తగిలి స్వల్ప గాయాలయ్యాయి.



దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతరను పురస్కరించుకొని పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని కౌన్సిలర్లు బాలాజీ, ఫయాజ్ అహ్మద్, మొంబత్తి స్వామి, భాస్కర్‌లు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. రోడ్లు గుంతలు లేకుండా మరమ్మతులు చేయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఆకర్షణీయంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

లేబర్‌కోడ్ రద్దు కోసం పోరాటాలు



పోస్టరును విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్ రద్దు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప పేర్కొన్నారు. శనివారం మేడే పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా ప్రభుత్వరంగ సంస్థలను అప్పజెబుతుందని ఆరోపించారు. లేబర్ కోడ్‌ల రద్దు వలన కార్మికుల కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్టం పేరిట రూ.లక్షల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టే కుట్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కుమార్, నారాయణ, ఈరన్న పాల్గొన్నారు.

ఎస్టీలపై దాడులను అరికట్టాలి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఎరుకుల సామాజిక వర్గం ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాయలసీమ ఇన్‌చార్జీ మోపూరి సూర్య కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఆదోని డివిజన్‌లో వెయ్యి కుటుంబాలకు ఎస్టీలు ఉన్నారన్నారు. వారంతా పందుల పెంపకం, చీపుర్లు, బుట్టలు తయారుతోనే వారి జీవనం చేస్తున్నారన్నారు. నేటికి చాలామందికి ఆధార్‌కార్డులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

లక్ష్మీనారాయణ మృతి బాధాకరం: ఎమ్మెల్యే



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

చిప్పగిరి/ఆలూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ మృతి బాధాకరమని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పేర్కొన్నారు. సోమవారం చిప్పగిరిలో లక్ష్మీనారాయణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఒకే మండలంలో కలిసి పనిచేశామని గుర్తు చేసుకున్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం



మెమెంటోలతో ఉత్తమ విద్యార్థులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సాళే విద్యావర్ధక సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేనేత వర్గాల్లో 10వ తరగతితోపాటు ఇంటర్‌లో ఉత్తమ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు సాకరే మారుతిరావు మాట్లాడుతూ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని విద్యార్థులకు సూచించారు. ఉత్తమ విద్యార్థులుగా ఎంపికైన సాకరే సంజన, నిఖిత, శ్రీ హర్ష, రసాళే రంజిత, అఖిల, మలేకార్ సీమ, రసాళే శృతి, సాకరే మనోహర్‌లతోపాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో పెద్దలు సాకరే తాయప్ప, సాకరే గోపాలకృష్ణ, కేజీ ఈరన్న, రసాళే గోవిందరావు, రామలింగ, బాలాజీ, శంకర్ పాల్గొన్నారు.

సంచార వైద్యశాల తనిఖీ



మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

దేవనకొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సంచార వైద్యశాలను జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తనిఖీ చేశారు. మండలంలోని ఈదులదేవరబండలో సంచార వైద్యశాల(104) పర్యటించి గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నోడల్ అధికారి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందునా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా నీరు అధికంగా తాగాలని ఎండలో తిరిగేటప్పుడు, తలపై టోపి లేదా దుస్తులను కప్పుకొవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, సుంకన్న, ఖలీల్, తదితరులు ఉన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏవీ?

- గడువు రెండు రోజులే..
- అప్‌డేట్ కోసం ఆదోనికి పరుగులు తీస్తున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఆదోని సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న దృశ్యం

ఆలూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఉన్న వారంతా ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ వేసేందుకు ప్రభుత్వం గడువు విధించింది. అయితే ఇక రెండు రోజులు మాత్రమే సమయం ఉంది. అయితే ఆలూరు పట్టణంలో ఒక్క ఆధార్ కేంద్రం కూడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

● అప్‌డేట్ కోసం 30 కి.మీ. దూరంలో ఉన్న ఆదోనికి పరుగులు ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు చిన్న పిల్లలను తీసుకుని వ్యయప్రయాసాలతో 30 కి.మీ. దూరంలో ఉన్న ఆదోనికి పరుగులు తీస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తున్నారు. ప్రతిరోజూ ఆలూరు నుంచి 30 మందికి పైగా ఆదోనికి వెళ్లి అప్‌డేట్ చేసుకుంటున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం కూడా 15 రోజులుగా మూతపడింది. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా ప్రజాప్రతినిధులు కూడా ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇదే విషయంపై తహసీల్దార్ గోవింద్‌సింగ్‌ను వివరణ కోరగా తమ పరిధిలో లేదని సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి ఆధార్ అప్‌డేట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు మాత్రం చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల నుంచి అనుమతి వస్తే ఏర్పాటు చేస్తాం

ఆధార్ అప్‌డేట్ కోసం సచివాలయం సిబ్బందికి టెస్ట్ నిర్వహించి వారికే బాధ్యత అప్పగిస్తాం. ఇందుకోసం ఒక్కరిని ఎంపిక చేశాం. ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక క్యాంపులు పెట్టాలని ఆదేశాలు వస్తే ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని సచివాలయాల్లోనే ఏర్పాటు చేస్తాం.

మహబూబ్‌బాషా, ఎంపీడీవో, ఆలూరు

సమస్యల పరిష్కారానికి రిలే దీక్షలు



పత్తికొండలో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

పత్తికొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమస్యలపరిష్కారంకోరుతూ నేషనల్‌మజ్దూర్‌యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసి సిబ్బంది రిలేదీక్షలకు దిగారు. పత్తికొండ ఆర్టీసీ డిపోవద్ద రిలేదీక్షలను యూనియన్ రిజినల్ ఉపాధ్యక్షుడు రంగన్న ప్రారంబించారు. డ్రైవర్లు ఎన్.నాగరాజు,విఆర్‌శేఖర్ కండక్టర్లు ఎస్ఎల్ సింగ్, ఎస్ఎండి రఫిలు దీక్షలలో కూర్చున్నారు. రంగన్న మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ చాలా రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ఇటు యాజమాన్యం అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అందుకే రిలేదీక్షలకు దిగాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికి స్పందించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్‌నాయకులు హరున్‌బాషా, అయ్యన్న, మధు,మూర్తి, ఐసీ శేఖర్, తిరుమలేష్, పెద్దయ్యలతోపాటు పలువురు యూనియన్ నాయకులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

మద్దికెర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తహసీల్దార్ హుశేన్ సాహేబ్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను పరిష్కరించి తీరుస్తామన్నారు. వీఆర్వోలు రీసర్వే ముగిసిన వెంటనే ప్రజలకు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. రైతుల సహకారంతో రీసర్వే వెంటనే పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో డిటీ శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్ రవి, ఆర్ఐ రామదాసు, వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

పనులు కల్పించకపోతే ఎలా..?



తుగ్గలిలో ఏపీవోతో మాట్లాడుతున్న కూలీలు

తుగ్గలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోతే వస్తులుండాల్సి వస్తుందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పర్లపల్లికి చెందిన ఉపాధి కూలీలు తుగ్గలికి చేరుకుని ఏపీవో కార్యాలయం వద్ద ఉపాధి పనులు కల్పించాలని ఆందోళనలు చేపట్టారు. ఈ ఏడాది పనులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా గ్రామంలో ఇప్పటి వరకు ఉపాధి పనులు కల్పించలేదని, ఇలా అయితే.. మేము వలస వెళ్లక తప్పదని కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి డిమాండ్ ఇచ్చిన ప్రతి కూలీకి పనులు కల్పించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షులు శ్రీరాములు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందుల్లో ప్రజలు

తుగ్గలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేలాపాలా లేని విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి తదితర గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు మాట్లాడుతూ పగలు, రాత్రి అను తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడంతో ఇబ్బందులు పడుతున్నామనీ, వ్యాపారాలు కూడా తగ్గిపోతున్నాయనీ, విద్యుత్ కోతలు ఏమైనా ఉంటే ముందస్తు సమాచారం ఇస్తే ఇబ్బందులు ఉండవన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా పరిష్కరించాలని కోరారు.

దనలయ్య కొండలో చిరుత సంచారం

క్రిష్ణగిరి, ఏప్రిల్ 28: మండలంలోని కంబాలపాడు-పెనుమాడ మధ్యలోని దనలయ్య కొండలో గత కొన్ని రోజులుగా చిరుత సంచరిస్తోంది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి సమీప పొలాల్లో తిరుగుతు కుక్కను చంపి కొండపైకి తీసుకెళ్లిన ఆనవాళ్లను,చిరుత పాద ముద్రలను సోమవారం రైతులు కనుగొన్నారు. గత కొన్ని రోజులుగా చిరుత సంచారంతో రైతులు,ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు.

సారా విక్రేతల అరెస్టు



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

వెల్దుర్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎల్.తండా గ్రామంలో ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న లక్ష్మీబాయి, పార్వతీ బాయి, ఈశ్వరీబాయిలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 24 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అలాగే గ్రామ పరిసర ప్రాంతాల్లో దాడులు చేసి 1880 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడులలో కర్నూలు ఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్, కర్నూలు ఎక్సైజ్ సీఐ కృష్ణ, కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల, ఎస్ఐలు చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పగిడిరాయి కొత్తూరులో తాగునీటి ఎద్దడి



కొళాయిల వద్ద బిందెలను క్యూలో పెట్టిన దృశ్యం

తుగ్గలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడిరాయి కొత్తూరులో తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో 2,500 మంది నివసిస్తున్నారు. గ్రామానికి బొల్లవానిపల్లె గ్రామ సమీపంలో బోరువేసి పైపులైన్ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. భూగర్భ జలాలు ఇంకిపోవడంతో మూడు రోజులకోసారి కూడా తాగునీరు అందడం లేదు. దీంతో ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. నీటి సమస్య పరిష్కరించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మలేరు.. కొనలేరు..

● మూడు రోజులుగా రీసర్వే పేరుతో భూములకు సంకెళ్లు



రీసర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

మద్దికెర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేలో అనేక అవకతవకలు జరిగాయి. ఉన్నవి లేనట్లుగా.. లేనివి ఉన్నట్లుగా రికార్డులలో నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తమ భూములలో తమ పేర్లు ఉన్నాయో లేదో అన్న ఆందోళన మొదలు కాగా, కుటుంబ సమస్యలతో భూములు అమ్ముదామన్నా.. అమ్మలేరు.. కొనలేని పరిస్థితి నెలకొని ఉంది. మండలంలోని పెరవలి, హంపా, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో మొత్తం 16వేల ఎకరాల్లో రీసర్వే చేశారు. రీసర్వేలో అనేక అవకతవకలు జరిగాయి. దాదాపు 300 మంది రైతులకు ఇనామ్ భూములుగా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. మరి కొంత మంది రైతులకు అడంగల్, 1బీ, పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ మిగులు భూముల కింద పడిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం మ్యుటేషన్ చేసుకోవాలన్నా వీలు కావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా భూముల రీసర్వే చేస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన భూములకు సమస్యలు పరిష్కారం కావడం లేదు. పెరవలి గ్రామంలో రైతుల భూములు దేవాలయ భూములుగా పడ్డాయి. గత ప్రభుత్వంలో రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆయా గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వే పేరుతో రైతులు తమ భూములను అమ్ములేక, కొనలేకపోతున్న పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి మా భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

● మా గోడు పట్టించుకునే వారే లేరా..?



మా గ్రామంలో రీసర్వే పూర్తి చేశారు. మాకు సంబంధించిన భూములన్నీ 1బీ అడంగల్ ఉన్నప్పటికీ మిగులు భూమి పడిందని మ్యుటేషన్ కడుదామంటే రీసర్వే జరిగిన గ్రామాల్లో కట్టేక లేదని చెబుతున్నారనీ అన్నారు. దీంతో మా స్థలాన్ని అమ్ముకుందామన్నా అమ్ముకోలేక పోతున్నామన్నారు.

- సోమశేఖర్ గౌడు, పెరవలి

● భూ సమస్యలను పరిష్కారిస్తాం



మండలంలోని పెరవలి, హంసా, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, రీసర్వేలో భూ సమస్యలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. కాస్త సమయం తీసుకుని అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. రైతులు సహకరించాలి

- హుస్సేన్ సాహెబ్, తహసీల్దార్

రీసర్వే పేరుతో మోసం చేశారు

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబ సభ్యుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న రైతులు

మద్దికెర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు రీసర్వే పేరుతో మోసం చేశారని మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన చిప్పగిరి నరసమ్మ, నాగరాజు, ఆనందు, వేణుగోపాల్, ఆరోపించారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాలుతూ హంపా గ్రామ రెవెన్యూ పరిధిలో 844 సర్వేనెంబరులో మొత్తం 8 ఎకరాల పొలం ఉందని, మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ సర్వేయర్ పెద్ద ఎత్తున మామూళ్లు తీసుకుని పోతురాజు నారాయణ, వెంకటేశ్వర్లు అనే పేర్లమీద సబ్‌డివిజన్ చేశాడని ఆరోపించారు. విషయంపై తహసీల్దార్ హుశేన్ సాహేబ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆ పొలంపైన నరసమ్మే ఉందని రీసర్వేలో ఎవరు మార్చారో విచారణ చేసి తగిన న్యాయం చేస్తానని తహసీల్దార్ వివరణ ఇచ్చారు.

రూ.10 లక్షలతో ముఖద్వారం ఏర్పాటు



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న దాతలు

తుగ్గలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తిమ్మగురుడు, ఫక్కీరప్ప స్వాముల ఆలయానికి నూతన ముఖద్వారాన్ని దాతలు ప్యాపిలి మండలం పెద్దపూజర్ల గ్రామానికి చెందిన పార్లపల్లె రామ్మోహన్, రమాదేవిలు ప్రారంభించారు. సోమవారం మీటితాండ సమీపంలో వెలసిన తిమ్మగురుడు, ఫక్కీరప్పస్వాముల ఆలయాలకు ముఖద్వారాన్ని పార్లపల్లె పెద్దతిమ్మప్ప, రంగమ్మ, చిన్న తిమ్మప్ప, చిన్న రంగమ్మల జ్ఞాపకార్థం దాత పార్లపల్లె రామ్మోహన్ రూ.10 లక్షలతో నిర్మించారు. ఆ ముఖద్వారాన్ని కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తల సమక్షంలో పూజలు నిర్వహించి యజ్ఞ యాగాలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుదర్శన్ రెడ్డి, రిటైర్డు ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య ఆచారి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మద్దికెర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే.. మంచి ఫలితాలు సాధించవచ్చని మండల విద్యాధికారి రంగస్వామి, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ ఏడాది 2025 పదో తరగతి ఫలితాల్లో పాఠశాల టాపర్‌గా నిలిచిన పవిత్రకు గ్రామానికి చెందిన రవికుమార్ నగదుతో పాటు ప్రశంసా పత్రం మెమెంటో ఇచ్చి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంజి నాగరాజు, విశ్వనాథ్, నారాయణ స్వామి ఆలయ పూజారి రంగస్వామి, ఉన్నారు.

ఎంపీడీవోగా పదోన్నతి



మద్దికెర, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పని చేస్తున్న మద్దిలేటి స్వామికి ఎంపీడీవోగా పదోన్నతి లబించిందని మద్దిలేటి స్వామి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగేళ్ల పాటు ప్రజలకు సేవలు అందించాననీ అన్నారు. నా సేవలకు సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిదులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాతనలో చలివేంద్రం ఏర్పాటు

తుగ్గలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాటాసారులు, ప్రజల దాహార్తి తీర్చేందు కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి, ఎంపీడీవో విశ్వమోహన్ అన్నారు. సోమవారం మండల పరిదిలోని రాతనలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్వర్, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

క్రిష్ణగిరి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయ అధికారి తోటమ్మ అన్నారు.ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంను గ్రందాలయంలో సోమవారం ప్రారంబించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు ప్రపంచంలో జరిగిన ప్రతి విషయాన్ని,విజ్ఞానాన్ని తెలుసుకోవచ్చాన్నారు. జూన్ 6వరకు ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలి..



జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలంతా వేసవి సెలవులు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ డిమాండ్ చేశారు. బాలసంజీవని 2.0లో మార్పులు చేయాలని, ఈకేవైసీ, ఓటీపీలు తీసివేయాలని, రేషన్‌షాపుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు సునయన ఆడిటోరియంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ లో జాయింట్ కలెక్టర్ నవ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడేశ్వరీ పాల్గొన్నారు.

పంటలకు రక్ష.. భూసార పరీక్ష

● ఫలితాలు సకాలంలో అందితే మేలు
● క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన

గోనెగండ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా.. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. మట్టి స్వభావం తెలుసుకోవాలన్నా, భూమిలో ఎలాంటి పంటలు పండించాలన్నా, ఎరువులు ఎంతమోతాదులో వాడాలో తెలుసుకోవాలన్నా.. పరీక్ష ఫలితాలకు అనుగుణంగా వాడితే రైతుకు పెట్టుబడి తగ్గడమే కాకుండా ఆశించిన దిగుబడులు వస్తాయి. భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. రైతు వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు, ఎరువుల ఆధారంగా భూమిలో మార్పులు చెందుతుంటాయి. ఆ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, వ్యవసాయం చేస్తేనే పంటలు బాగా పండుతాయి. వీటిని అధిగమించి రైతు సకాలంలో పంటలు వేస్తూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహిస్తోంది.

ఎమ్మిగనూరు డివిజన్‌లోని ప్రతి రైతు సేవా కేంద్రం నుంచి 55 మట్టి నమూనాలను సేకరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అందులో బాగంగా గోనెగండ్ల మండలం నుంచి 1265, ఎమ్మిగనూరు మండలం నుంచి 1265, నందవరం నుంచి 1045, మంత్రాలయం నుంచి 1100 మట్టి నమూనాలను సేకరించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం పరిధిలోని ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, మంత్రాలయం మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1లక్ష 52వేల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. ఈ మండలాల్లో ఎర్రరేగడి, నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానుండడంతో మట్టి పరీక్షలు చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. శాస్త్రీయ పద్ధతిలో మట్టిని సేకరించి ప్రయోగశాలకు పంపుతున్నారు. ఐదేళ్లుగా శ్యాంపిల్స్‌ను సేకరిస్తున్నారు.



మట్టిని పరీక్షిస్తున్న వ్యవసాయాధికారులు

● పొలంలో మట్టిని ఎప్పుడు తీయాలి:

పంటలు వేసే ముందు మట్టి నమూనా సేకరించాలి. ఆ మట్టిని ప్రయోగశాలకు పంపాలి. ఎరువులు వేసిన నెల రోజుల వరకు మట్టి నమూనాలు తీయకూడదు. నీరు పెట్టిన తరువాత, నీడపడే ప్రాంతంలో, ఎరువుల కుప్పల దగ్గర, గట్లు, చెట్ల ప్రాంతంలో, మట్టిని తీయకూడదు. ఒక పొలంలో ఒక నమూనా మాత్రమే తీయాలి. పెద్ద పొలం అయితే ప్రతి రెండునుంచి ఐదు ఎకరాలకు ఒక నమూన తీయాలి. నేల నిర్మాణం, రంగు, మురుగు, నీటి పారుదల సౌకర్యం, నేలవాలు, చౌడు, క్షారం, ఆమ్లగుణాలు, పంటల సరళి తదితర విషయాల్లో తేడాలు కనిపిస్తే అన్నిరకాల నమూనాలు సేకరించాల్సి ఉంటుంది.

● పరీక్షలు ఇలా:

పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలలో విశ్లేషించి వాటి లక్షణాలను శాస్త్రవేత్తలు తెలుసుకుంటారు. పోషకవిలువలు తెలుసుకొని వాటి ఆధారంగా ఏ పంటలు సాగు చేసుకోవాలో ఎంత మోతాదులో ఎరువులు వాడాలో శాస్త్రవేత్తలు సిఫారస్ చేస్తారు. దీంతో ఎరువులకు పెట్టే ఖర్చు తగ్గిపోతుంది. మమూలు కన్నా 30 శాతం అధిక దిగుబడి సాధించవచ్చు.

భూసార పరీక్షలు తప్పని సరి

ప్రతి రైతు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకొవాలి. ఆయా మండలాలలోని ప్రతి రైతు సేవా కేంద్రం నుంచి 55 మట్టి నమూనాలను సేకరిస్తున్నామన్నారు. ఈ పరీక్షల ద్వార భూమిలో ఉండే పోషక విలువలు తెలుస్తాయి. భూసారన్ని, లోపాన్ని బట్టి వాటికి అవసరమయ్యే సూక్ష్మ పోషకాలుసూచనల మేరకు మందులు వాడాల్సి ఉంటుంది. దీంతో అధిక దిగుబడులకు అవకాశం ఉంటుంది.

- మహ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

'అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి గోవింద్

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లను కూల్చివేయడం తగదని చెప్పిన సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్‌రావుపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీపీఎం పట్టణ, మండల కమిటీ నాయకులు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో పట్టణ కార్యదర్శి గోవిందు, నాయకుడు రాముడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ స్పీకర్‌కు ఇల్లు కూలగొట్టడం మాత్రమే తెలుసని సీపీఎం మండిపడింది. పేదల ఇళ్లను కూల్చడాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన శ్రీనివాస్‌రావుపై డిప్యూటీ స్పీకర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవి

నందవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవి సూచించారు. సోమవారం నందవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పుల్లయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట ఆయా శాఖలు చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరించారు. బాల్యవివాహలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాగలదిన్నె ఎంపీటీసీ అతావుల్లా అధికారులను కోరారు. ఉపాధి హామీ పనులు చేపట్టి పండ్లతోటల సాగు గురించి, గృహనిర్మాణాలపై అవగాహన కల్పించాలని పొణకలదిన్నె ఎంపీటీసీ జైపాల్‌రెడ్డి కోరారు. అప్పుల బాధతో ఇటీవల ఆత్మాహత్య చేసుకున్న కుటుంబానికి వెంటనే పింఛన్ ఇచ్చి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా ఆదుకోవాలని ఎంపీపీ కోరారు. అన్ని గ్రామాల్లో నీటి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వైస్ ఎంపీపీ అగ్నేషమ్మ, డీటీ శశిశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో సందీప్, డాక్టర్ శ్రీలేఖ, పీఆర్ ఏఈ నరసింహులు, నాగేంద్ర పాల్గొన్నారు.

'డిమాండ్లను నెరవేర్చాలి'



రిలే నిరాహర దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఉద్యోగులు రిలే నిరాహర దీక్ష చెపట్టారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకుని డిపో గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నినాదాలు చేస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు డిపో రీజనల్ అధ్యక్షులు ఎన్ ఆర్ నాయుడు, ఎస్‌ఎం రఫీక్‌లు మాట్లాడారు. భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు డబుల్‌డ్యూటీ అమౌంట్ పెంచాలని, ఉద్యోగులపై విధించే అక్రమ సస్పెన్షన్, రిమూవల్స్ ఆపాలని కోరారు, బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, నిలిచిపోయిన ప్రమోషన్ ఇవ్వాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో షరీఫ్, సాహెబ్, బజారప్ప, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి అందరి బాధ్యత



దోమల నివారణ మందును పిచికారీ చేస్తున్న కార్మికుడు

గోనెగండ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి గ్రామంలోని ప్రజలందరి బాధ్యతని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని పలు వీధుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టాలని అందుకు ఆయా గ్రామాల ప్రజలు కూడా సహకరించాలని కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి పన్ను, కొళాయి పన్ను, ఇతర పన్నులను ఈ నెల చివరిలోపు వందశాతం వసూళ్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుభాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్‌ఐ

నందవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలో కనకవీడులో దేవరను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ కేశవ్ సూచించారు. సోమవారం నందవరం స్టేషన్‌కు గ్రామ పెద్దలను పిలిపించి ఎటువంటి గోడవలు లేకుండా శాంతియుత వాతావరణంలో పండుగా జరుపుకోవాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు

ఎమ్మిగనూరు టౌన్,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన ఎమ్మిగనూరుకు చెందిన క్రీడాకారులకు తహసీల్దార్ శేషఫణి సోమవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. పట్టణంలోని భవిత కేంద్రంలో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఏప్రిల్ 21 నుంచి 23వ తేది వరకు విజయవాడలో జరిగిన పోటీలలో పాల్గొని పలు క్రీడలలో ప్రతిభ కనబరిచారు. శేఖర్ సైక్లింగ్‌లో మెదటి స్థానం, ఎం.సంతోష్ 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, ఎం.దిలీప్ 50 మీటర్ల పరుగు పందెంలో రెండోస్థానం సాధించారు. వీరిని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీవో బంగారమ్మ, ఎంఈవో ఆంజనేయులు అభినందించారు. కార్యక్రమంలో బాబు, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు అవగాహన అవసరం అని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. ఒంటెడుదిన్నె గ్రామంలో ప్రజలతో పోలీసు చట్టాలు, కోర్టు, న్యాయం పైన అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో కొంతమంది ఘర్షణలు సృష్టించేందుకు చూస్తుంటారని, వారి మాటలు నమ్మకూడదన్నారు. గ్రామాలాలో అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులకు సూచించారు. ద్విచక్రవాహనాలలో ప్రయాణించే సమయంలో తప్పక రోడ్డు జాగ్రత్తలను పాటించాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగం నిర్వీర్యం: యూటీఎఫ్

గోనెగండ్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ ఉనికి కోసం సంస్కరణల పేరుతో ప్రభుత్వ పెద్దలు విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌పాటిల్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జీవో నెం 117 పేరుతో 3,4,5 తరగతులను దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాలలో విలీనం చేసి ప్రాథమిక పాఠశాలలను భ్రష్టు పట్టించారని అన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో మిగులు టీచర్లతో సర్దుబాటు చేయడం కాకుండా సబ్జెక్ట్ టీచర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రపాల్, సుధాకర్, జిక్రియా, నాగేశ్వరరావు, శేఖర్‌బాబు, వీరేష్, శేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.3 లక్షల విరాళం

మంత్రాలయం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన మధుసూధన్ భట్ అనే భక్తుడు రూ.లక్ష ధైనందిక సేవకు, సుబ్బనరసింహా అనే భక్తుడు రూ.1లక్ష అన్నదానం, రూ.1 లక్ష ధైనందిక సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్‌కోణాపూర్ తెలిపారు. సోమవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదు రూపంలో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో రవికులకర్ణి, శ్రీపాద ఆచార్, గిరిధర్, అనంతపురాణిక్ తదితరులు పాల్గోన్నారు.

రామలింగేశ్వరునికి మహా రుద్రాభిషేకం

మంత్రాలయం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రామలింగేశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. వైశాఖ సోమవారం పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని రామలింగేశ్వరునికి విశేష పంచామృతాభిషేకం, సామూహిక సంకల్పం, 108 బిల్వ పత్రాలతో శివ అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. ఆలయ అర్చకులు వీరేష్ స్వామి పూజలు చేశారు. స్వామివారికి నైవేద్యాలు, మహా మంగళహారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రామలింగేశ్వరస్వామిని అలంకరించిన దృశ్యం

పహల్గాం మృతులకు న్యాయవాదుల నివాళి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సోమవారం ఎమ్మిగనూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీద్, సీనియర్ న్యాయవాదులు ముజరహుల్ హక్, లక్ష్మీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయటం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఆనంద్, న్యాయవాదులు మురళీకృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, ఇజికియ, రామకృష్ణ నాయుడు, గురురాజరావు, జగన్నాథరెడ్డి, నర్సిరెడ్డి, రఘు పాల్గొన్నారు.

నవోదయంతో సారా నిర్మూలన

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): నవోదయం కార్యక్రమం ద్వారా సారా నిర్మూలనకు కృషి చేయాలని సేట్ ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఎమ్మిగనూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవోదయం కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని విలేకర్లు ప్రశ్నించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అధికారులు రాజశేఖర్ గౌడ్, స్థానిక ఎక్సైజ్ పోలీసు సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రేపు బసవేశ్వర స్వామి జయంతి

మంత్రాలయం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం బసవేశ్వరస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించు కోవడంతో పాటు భారీ ఊరేగింపునకు ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు సుజాత శంకర్ ఎల్ల లింగయ్య, మహాబ లేశ్వరప్ప తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బసవేశ్వర స్వామి జయంతి, జంగమహేశ్వర సంఘం, వీరశైవ సంఘం, సంగమేశ్వర సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బసవేశ్వర స్వా మి జయంతి వేడుకల ఊరేగింపు కోసం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తీసుకున్నారు. బుధవారం పాత ఊరిలో వెలసిన రామలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి మహా ముఖద్వా రం మీదుగా రాఘవేంద్ర సర్కి ల్ వరకు ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు మహా మంగళహారతులు, బసవేశ్వరస్వామిని ప్రత్యేక వాహనం పై ఉరేగించి చేసి భక్తి పాటలు, మంగళ వాయిద్యాలు, భజన మండళ్ల మధ్య ఘనంగా స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఇందుకు గ్రామస్తులు సహకరించి వీర శైవ సంఘం, జంగ మహేశ్వర సంఘం నాయకులు సహకరించాలని కోరారు. బండి మల్లికార్జున, మూలింటి చంద్రశేఖర్‌గౌడ్, మల్లికార్జున, పరమేష్‌గౌడ్, శంకర్ పాల్గొన్నారు.



పోలీసులకు వినతి పత్రం ఇస్తున్న వీరశైవ లింగాయత్‌లు

ఆర్డీఎస్ కుడి కాలువకు నిధులు కేటాయించాలి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆర్డీఎస్ కుడి కాలువ సాధన సమితి నాయకులు కోరారు. సోమవారం సాధన సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నాగన్న, బతకన్న, గణేష్ మాట్లాడుతూ తుంగభద్రనది వరదజలాలు నిలుపుకోవటానికి ఎటువంటి రిజర్వాయర్లు లేకపోవటం వల్ల ప్రతిఏటా 150 టీఎంసీల వరదజలాలు సుంకేసులను దాటి శ్రీశైలంలో కలుస్తున్నాయన్నారు. తుంగభద్ర ఎల్లెల్సీ కాలువకు చట్టబద్ధ హక్కుగా ఉన్నా 29టీఎంసీల నికర జలాలు కేటాయింపు ఉన్నప్పటికి గత 30 ఏళ్లుగా 10 టీఎంసీల నీరు ఇవ్వలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ ఆయకట్టు స్థిరీకరణ కోసం బ్రిజేష్ ట్రిబునల్ ఆర్డీఎస్ కుడికాలువకు నాలుగు టీఎంసీల నికర జలాలు కేటాయించినప్పటికీ కాలువనిర్మించుకునే పరిస్థితి లేదన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి రూ.1800 కోట్లు కేటాయించి కాలువ నిర్మాణపనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాసు, శాంతిరాజు, నల్లన్న, అగ్రీప్ప, పురుషోత్తం, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఘనంగా ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం వైశాఖమాసప్రారంభ పాడ్యమిని పురస్కరించుకుని బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. అనంతరం వెండి రథాన్ని వివిధ పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వా యిద్యాల మధ్య ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పండితులు మహా మంగళ హారతులు ఇచ్చి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

రాఘవేంద్రస్వామి భారీ రంగోళి చిత్రీకరణ

మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో విశాలమైన మధ్వమార్గ్ కారిడార్‌లో భారీ రాఘవేంద్రస్వామి చిత్రంతో కూడిన రంగోళిని చిత్రించారు. కర్ణాటకలోని మైసూరు పునీత్ కళావీరా బృందం సభ్యులు వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దారు. ఆదివారం రాత్రి నుంచి పనులు ప్రారంభించగా.. ఈ నెల 30న బుధవారం అక్షయ తృతీయకు రాఘవేంద్రస్వామి చిత్రీకరణ పూర్తవుతుందని పునీత్ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా శ్రీనివాస విగ్రహ ప్రతిష్ఠాపన

నారాయణపేట జిల్లాలోని కోతకోట మండలం నర్సాచలం గ్రామంలో శ్రీభూ శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక భక్తులు, వేద పండితులు, భజన పాటలు, కోలాట నృత్యాల మధ్య పీఠాధిపతికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠాపన చేసి శాంతిపూజలు చేశారు. అనంతరం శ్రీనివాసుని మహిమలు భక్తులకు దివ్యసందేశాన్ని పీఠాధిపతి వినిపించారు. కార్యక్రమంలో ద్వారపాలక అనంతస్వామి వరదేంద్రాచార్, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌ఐ

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రజలు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కలుగొట్ల గ్రామంలో గ్రామస్థులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా ఆకతాయిలు మద్యంతాగి అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేసి రోడ్డు భద్రతా నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పశుగ్రాసాన్ని తరలించవద్దు

కోసిగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా ట్రాక్టర్లలో పశుగ్రాసాన్ని తరలించాలని ఎస్‌ఐ హనుమంతరెడ్డి సూచించారు. సోమవారం ట్రాక్టర్ యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 25న 'ఆంధ్రజ్యోతి 'లో వాహనదారుల అగచాట్లు అన్న కథనాన్ని ప్రచురించింది. దాంతో స్పందించిన కోసిగి ఎస్‌ఐ సోమవారం పశుగ్రాసం తరలిస్తున్న డ్రైవర్, యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అధిక ఎత్తులో వెడల్పుగా పశుగ్రాసాన్ని తరలించరాదని, విద్యుత్ తీగలను పరిశీలించుకొని ప్రమాదాలు జరకుండా తరలించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రూ.10వేలు జరిమానా

కోసిగి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో బ్రహ్మాన్ గౌడ్ అనే వ్యక్తికి ఆదోని కోర్టులో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ రూ.10వేలు జరిమానా విధించినట్లు కోసిగి ఎస్‌ఐ హనుమంత రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణా లు తీసే ప్రమాదం ఉందన్నారు. ఎస్పీ, డిఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడితే మాత్రం శిక్షలు కఠినంగా ఉంటాయన్నారు. జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పెద్దకడబూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీ నారాయణను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆనందరాజు, తిక్కన్న డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందన్నారు. ఇందుకు కారకులైన వారిని ప్రభుత్వం శిక్షించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.

ఆర్డీటీని కొనసాగించాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీని కొనసాగించాలని ఎన్‌ఎస్ యూ ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ద్వారా పశ్చిమ ప్రాంతాల్లోని ప్రజలకు ఎన్నో ఇళ్లను నిర్మించిందన్నారు. ఎంతో మంది విద్యార్థులకు చదువులు చెప్పిస్తుందన్నారు. అలాంటి సంస్థపై కేంద్ర ప్రభుత్వం వేటు వేయడం సమంజసం కాదన్నారు. వెంటనే ఆర్డీటీ సంస్థ సేవలను పునః ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీడీ అలిపీరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులు ఉపాధి హామీ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. పండ్ల తోటలకు ప్రభుత్వం సబ్సిడీని అందజేస్తుందన్నారు.